# సాహిత్యం

# ఎందుకు చదువాలి?

డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

యువభారతి
సాహితీ సాంస్కృతిక సంస్థ
హైదరాబాదు

Blank Page

# సాహిత్యం
## ఎందుకు చదువాలి?

డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

యువభారతి
సాహితీ సాంస్కృతిక సంస్థ
హైదరాబాదు

# సాహిత్యం ఎందుకు చదువాలి?

# [Why read Literature?]

Published by YUVABHARATHI, Hyderabad.

© yuvabharathi

Publication No. 171

ప్రథమ ముద్రణ : 04-09-2007 (కృష్ణాష్టమి)

కాపీలు : 500

మూల్యం : రూ॥ 30/-

ప్రతులు లభించు స్థలం :

**యువభారతి**

ఆంధ్ర సారస్వత పరిషత్ బిల్డింగ్స్,
తిలక్ రోడ్, హైదరాబాద్-500 001.
మరియు

**పూలబాట సర్క్యులేషన్ లైబ్రరీ**

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బిల్డింగ్,
ఫ్లాట్ నెం. 405/బి, రాధాకృష్ణ ఎస్టేట్స్,
కె.పి.హెచ్.బి. కాలనీ, హైదరాబాద్-500 072
ఫోన్ : 040-2305 5349

ముద్రణ :

వాగ్దేవి ప్రింటర్స్

నల్లకుంట, హైదరాబాద్-44

ఫోన్ : 27673772

# మా మాట

యువభారతి సాహితీసాంస్కృతిక సంస్థ సమాజహితం కోసం, సాహిత్య అభ్యుదయం కోసం ఉడుతా భక్తిగా కృషి చేస్తున్నది. సమాజంలో సౌమనస్యం, సౌజన్యం పెంపొందించడానికి ప్రయత్నిస్తున్నది. సమైక్య భావాలను, నిర్మాణాత్మక దృక్పథాలను ప్రోత్సహిస్తున్నది. మనిషిలో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మక శక్తిని పరివ్యాప్తం చేయడానికి తోడ్పడుతున్నది. "చుట్టూరా ఆవరించుకుని వున్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడంకంటె, ప్రయత్నించి ఎంత చిన్న దీపాన్నయినా వెలిగించడం మంచిది" అన్న ధ్యేయంతో సాహిత్యాన్ని ప్రధాన సాధనంగా చేసుకుని ఇప్పటి వరకు నూటడెబ్బై పుస్తకాలను ప్రచురించింది.

డా॥ తిరుమల శ్రీనివాసాచార్యులు గారికి యువభారతితో నాలుగు దశాబ్దాల అనుబంధం. గతంలో డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి సంస్థ అధ్యక్షులుగా ఉన్నపుడు వారికి కుడిభుజంగా వ్యవహరించారు. ఆ తరువాత సంస్థ అధ్యక్షులయ్యారు. ప్రస్తుతం శ్రీనివాసాచార్యులవారు యువభారతికి గౌరవాధ్యక్షులు. వారు పద్యగేయవచన కవితా రచనలో సిద్ధహస్తులు. గేయ నాటికల మీద, ఆచార్య సి. నారాయణ రెడ్డిగారి సాహిత్యం మీద పరిశోధనలు చేశారు. ఆదర్శ అధ్యాపకులు. జనరంజకంగా ఉపన్యసించగల పండితులు. మనస్వి, స్నేహశీలి. తనకలంతో ఇప్పటి వరకు సుమారు ఇరవై పుస్తకాలను వెలువరించారు. వివిధ సంస్థల నుండి ఇరవై పురస్కారాలు అందుకున్నారు. అనేక సాహిత్య సంస్థలలో సభ్యునిగా, సలహాదారునిగా ఉంటూ సాహిత్యం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు.

యువభారతి కోరికపై శ్రీ ఆచార్యులవారు "సాహిత్యం ఎందుకు చదువాలి?" అనే అంశంపై ఎన్నో గ్రంథాలను పరిశీలించి అందరికీ అర్థమయ్యే విధంగా ఈ పుస్తకాన్ని రాశారు. దీన్ని యువభారతి తన 171వ ప్రచురణగా సమాజానికి అందిస్తున్నది.

యువభారతిని స్థాపించడమే కాకుండా, ఆ చిరుదీపాన్ని తన రెండు చేతులూ అడ్డుపెట్టి భద్రంగా కాపాడుతున్న ఆత్మీయులు ఆచార్య వంగపల్లి విశ్వనాథంగారు. ఆయన వృత్తిరీత్యా వాణిజ్య శాస్త్రాధ్యాపకుడే అయినా తెలుగు సాహిత్యంపై విశేష మమతానురాగాలున్న వ్యక్తి. యువభారతి పేరు చెప్పగానే మొదట గుర్తుకు వచ్చే వ్యక్తి ఆయనే. యువభారతీయులను ఒకే తాటిపై నడిపిస్తున్న వ్యక్తి ఆయన. సుమారు దాదాపు 9 సంవత్సరాల నుండి ప్రతి నెలా మొదటి ఆదివారం చిక్కడపల్లిలో గల నగర కేంద్ర గ్రంథాలయంలో యువకులకోసం ఉచితంగా వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఆచార్య విశ్వనాథంగారి సేవలకు గుర్తింపుగా ఆత్మీయంగా డా॥ శ్రీనివాసాచార్యులవారు ఈ గ్రంథాన్ని వారికి అంకితమిస్తున్నందులకు యువభారతి ఎంతో సంతోషిస్తున్నది; అభినందిస్తున్నది; కృతజ్ఞతలు తెలియచేస్తున్నది. ఈ పుస్తకాన్ని అందంగా ముద్రించి ఇచ్చిన వాగ్దేవి ప్రింటర్స్ వారికి కృతజ్ఞతలు. యువభారతి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న మహనీయులందరికీ అభివందనాలు.

**మాడభూషి అనంతాచార్య**
అధ్యక్షులు – యువభారతి

హైదరాబాదు
4.9.2007
(కృష్ణాష్టమి)

# ఈ పుస్తకం గూర్చి నాలుగు మాటలు

గత వత్సరం మిత్రులు ఆచార్య వంగపల్లి విశ్వనాథం గారు నన్ను పిలిచి - "మిత్రశ్రీ! ఆచార్యగారూ! 'సాహిత్యం ఎందుకు చదువాలి?' అనే అంశాన్ని గూర్చి, 30, 40 పుటలకు మించకుండ ఒక చిన్న పుస్తకం వ్రాసి ఇవ్వండి. నేనే దానిని అచ్చువేయిస్తాను. కీ.శే. డా॥ ఇరివెంటి కృష్ణమూర్తిగారి జయంత్యుత్సవ సభనాడే ఆ పుస్తకావిష్కరణం జరుగాలని నా ఆకాంక్ష" అని అన్నారు నాతో. సరే అన్నాను. పని ప్రారంభించి పూర్తిచేశాను. ఈ గ్రంథం వచ్చింది. సకాలంలో ప్రారంభించిన నీతి ఫలవంతమవుతుంది కదా! "కాలే ఖలు సమారబ్ధాః ఫలం బధ్నంతి నీతయః"

ఒక ప్రశ్నకు సుదీర్ఘ సమాధానం ఈ పుస్తకం. సాహిత్యం అన్నప్పుడు శ్రవ్యకావ్య - దృశ్యకావ్య భేదాలేకాక వచన రూపాలైన నవలలు, కథానికలు, స్వీయచరిత్రలు, జీవిత చరిత్రలు, వ్యాసాలు, విమర్శలు, పరిశోధనలు - ఇలా అన్నీ ఈ సాహిత్య పరిధిలోకి వస్తాయి. అందువల్ల ఆయా ప్రక్రియల స్వరూపస్వభావాలనూ వాటివల్ల కలిగే లాభాలనూ వేర్వేరుగా విశదీకరించవలసి వచ్చింది. అందుకే వ్యాసం సుదీర్ఘమైంది. విభిన్న సాహిత్య ప్రక్రియలతోడి సంబంధం ఉన్నందువల్ల ఈ పుస్తక రచనలో విషయంకోసం అనేక గ్రంథాలను ఉపయోగించుకున్నాను. ఆ గ్రంథకర్త లందరికీ నా హార్దిక కృతజ్ఞతాభి వందనాలను సమర్పించుకుంటున్నాను. ఈ వ్యాసరచనలో నావల్ల ఏమైనా పొరపాట్లు జరిగియుండవచ్చు. "ప్రమాదో ధీమతామపి". వాటిని సహృదయులు సూచిస్తే, మలిముద్రణలో వాటిని సవరించుకుంటానని మనవి చేస్తున్నాను.

ఆచార్య వంగపల్లి విశ్వనాథం గారి ఆకాంక్ష మేరకు ఈ పుస్తకం వ్రాశాను. ఈ రచనకు కారణం ప్రేరణం వారే. అందువల్ల ఈ గ్రంథాన్ని వారికే అంకితం చేశాను. ఈ గ్రంథాన్ని స్వీకరించినందుకు వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

ఈ గ్రంథ ముద్రణలో తోడ్పడిన 'యువభారతి' మిత్రులు శ్రీ అనంతాచార్య, శ్రీ ఎ. నాగేశ్వరరావు గారలకు నా ధన్యవాదాలు.

సహృదయులు ఈ పుస్తకాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

హైదరాబాదు

**డా॥ తిరుమల శ్రీనివాసాచార్య**

ఆత్మీయులు **ఆచార్య వంగపల్లి విశ్వనాథం** గారికి

# అంకితం

తల్లి 'లీల'లో ఆడిన తనయుడ వీవు
తండ్రి 'నీలకంఠ' దాన ధనుడవు నీవు
సౌమ్యశీల నీ 'ప్రమీల' సేవాహేల
సౌజన్యాంచిత ధిషణా ఘనుడవు నీవు

వాణిజ్యం నేర్పుటలో జాణవు నీవు
వాణీసేవా మోహన వీణవు నీవు
నీ ప్రవృత్తి యువభారతి; వృత్తి శ్రీసతి
సౌమనస్య ముక్తాభోషాణము నీవు

నీ వదనంలోన వివేకానందం
నీ సదనం కందుకూరి ఇలుచందం
మంచి నడత పండ్లు, చదువు చెట్లకు
అదే నీదు జీవన సుమమకరందం

నీ స్నేహం నాకు లక్ష
నీవు పెద్ద బాల శిక్ష
పెట్టెను నీ 'యువభారతి'
ఎందరికో జ్ఞాన భిక్ష

మంచితనం సుభాషణం నీకు
మంచి మైత్రి మహాధనం నాకు
'సాహిత్యం ఎందుకు చదువాలి?'
విశ్వనాథమా! కానుక నీకు

**-డా॥ తిరుమల శ్రీనివాసాచార్య**

# అరుదైన గౌరవం అందుకున్న వేళ...

ప్రసన్నవదనం, మా తిరుమల శ్రీనివాసాచార్యుల వారి ప్రత్యేకత. ఆ చెరగని చిరునవ్వు వెనుక, పుష్కలమైన పాండిత్యం, అద్భుతమైన ధారణాశక్తి, ఆకట్టుకునే వచోనైపుణ్యం; అసూయలేని మనస్తత్వం; సహకరించే సహృదయం; అలరించే స్నేహతత్త్వం; విశిష్టమైన వ్యక్తిత్వం బలంగా కనిపిస్తాయి.

గత నాలుగు దశాబ్దాలుగా మాలో ఒకరై, పదవులతో నిమిత్తం లేకుండా పనిలో భాగం పంచుకునే మనస్తత్వంతో ఏ కార్యభారాన్ని అప్పజెప్పినా, సక్రమంగా నెరవేర్చే సామర్థ్యంతో, మా యువభారతిలో డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి గారి తరువాత అత్యధికులకు అత్యంత ఆత్మీయులైనారు.

నేటి యువత "సాహిత్యం ఎందుకు చదువాలి?" అనే ప్రశ్నని వేసుకుంటున్నది. వేస్తున్నది. "సాహిత్యం చదివితే నేడు ఉద్యోగాలు రావు. భాషాభిమానం కూడు పెట్టదు. డబ్బు ముఖ్యం. భాషెందుకు? భాష కావాలనుకున్నా సాహిత్యం ఎందుకు చదువాలి?" ఈ తరహా ఆలోచనలు ముసురుకుంటున్నవేళ యిది. ఎవరో ఒకరు పూనుకుని సమాధానం చెప్పకపోతే, సరైన సమాధానం చెప్పటానికి ఇంకా ఆలస్యం చేస్తే, సాహిత్యం చదువనక్కరలేదు" అనే అభిప్రాయానికి భవిష్యత్తరాల వారు వచ్చే ప్రమాదముంది. మనతరం చవిచూసిన దానికన్నా మేలైన మంచిని తరువాతి తరానికి మిగిల్చి వెళ్లాలే తప్ప, భ్రష్టు పట్టించి, దిగజారిన విలువలతో కూడిన సమాజాన్ని వారసత్వంగా అందివ్వడం క్షంతవ్యం కాదు. చక్కని వ్యక్తిత్వ నిర్మాణానికి, ఉత్తమ సాహిత్య పఠనమే ప్రథమ సోపానం అనే భావం అందరిలోనూ బలంగా మనసులో నాటుకోవటానికి గాను, ఉత్తమ సాహిత్యం అందించేందుకు పూనుకున్నది యువభారతి. అందుకనే, సాహిత్యవేత్త, మా సన్నిహితులు శ్రీశ్రీనివాసాచార్యుల వారికి మా కోరిక తెలిపి ఈ ప్రయోజనం సిద్ధించే విధంగా రచనను చేయమని అభ్యర్థించాం.

మా యువభారతి గత నాలుగు దశాబ్దాలుగా పడిన ఆవేదన, చేసిన కృషి, ప్రస్తావించిన నివేదన - మా విన్నపాలు - ఓరకంగా ఈ పుస్తకంలో ప్రస్ఫుటమయ్యాయి. అక్షర బద్ధమైనాయి.

ఈ పుస్తకాన్ని ఆత్మీయంగా నాకు అంకితమిచ్చి తమ సహృదయాన్ని శ్రీనివాసాచార్యుల వారు చవిచూడనిచ్చారు. ఓ అరుదైన గౌరవాన్ని కలిగించి తమ అభిమానాన్ని అందించారు. వారికి మనసా కృతజ్ఞతలు.

హైదరాబాదు
4.9.2007
(కృష్ణాష్టమి)

**ఆచార్య వంగపల్లి విశ్వనాథం**
సమావేశకర్త - యువభారతి

# సాహిత్యం ఎందుకు చదువాలి?

**"వాగర్థా వివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే**
**జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ"** (కాళిదాస రఘువంశము)

"శబ్దార్థాల వలె, ఒకరినొకరు వదలక యుండునట్లు కలసినట్టి, జగానికి తల్లిదండ్రులైన పార్వతీ పరమేశ్వరులకు శబ్దార్థ జ్ఞానం కొరకు నమస్కరిస్తున్నాను."

**"ఇద మన్ధం తమః కృత్స్నం జాయేత భువనత్రయమ్**
**యది శబ్దాహ్వయం జ్యోతి రాసంసారం నదీప్యతే"** (దండి కావ్యాదర్శము)

"శబ్దమనే పేరుగల ఈ తేజస్సు సృష్టి ప్రారంభం నుండి ప్రకాశించకున్నట్లయితే ఈ సమస్తమైన లోకత్రయం కటిక చీకటిగా అయి ఉండేది."

"భాషకంటె నవ్యులకు తపస్సులేదు" (రాయప్రోలు రమ్యాలోకం)

''సర్వభాషయు సంకేతములు గలది. సంకేతములు లేకుండ మనము మాటాడుకొనలేము. భాషయే సంకేతము. సంకేతమనగా గుర్తు. వాని పేరు రాముడు. ఇది సంకేతము.''

"వాక్కు సర్వప్రాధాన్యము కలది. వాక్కులేనిచో సృష్టిలేదు. మనోభావమును చెప్పలేము. చెప్పలేనిచో పశువులము. మనలను పశువులుగా నుండనీయని దేవత సరస్వతి. ఆమె మనకు హక్కును ప్రసాదించుచున్నది." "ప్రధానముగా రెండే కనిపించుచున్నవి. లోనున్న శక్తి; వెలికి వచ్చెడు మాట. మూడవది యింకొక్కటి యేమియులేదు. సర్వదేవతలు ఈ రెండు శక్తుల యొక్క విభాగములే - మనుష్యుడు - మాట. ఈ రెంటి తరువాత ప్రపంచకమున్నది. సృష్టియున్నది" (విశ్వనాథ సాహిత్య సురభి)

**"విప్లవం ముమ్ముందు మనుష్యుని**
**మనస్సులో ప్రారంభమవుతుంది.**
**మనః ప్రపంచానికి బాహ్యస్వరూపంభాష**
**భాషా విప్లవమే భావవిప్లవం"** (శ్రీశ్రీ ఒకటీ పదీ)
**"శిశువులా భాషను పెంచాను నేను**
**పశువునే మనిషిగా మార్చింది తాను"**

"నా ఇంటి వివృత గవాక్షం భాష
నాకంటి వినిర్మల కటాక్షం భాష"
"విశ్వాన్ని గదిలోకి పంపే వెంటిలేషన్ భాష
వేయిపడగలెత్తి నర్తించే ఇన్స్పిరేషన్ భాష."
"విడగొట్టేది కాదు కలిపి కుట్టేది భాష
పడగొట్టేది కాదు నిలబెట్టేది భాష"
"భాషే నేను తెచ్చుకున్న తీయని వరం
భాషే నేను కట్టుకున్న జీవన గోపురం" - (డా॥సి. నారాయణరెడ్డి మనిషి-చిలక)

మనం మన భావాన్ని వ్యక్తం చేయడానికి ఉపయోగించే ప్రధాన సాధనం భాష. మన లోకయాత్ర సాగేది ఈ భాషా సంపదవల్లనే. శాస్త్రాలకన్నింటికీ మూలం భాష. శాస్త్రాభ్యాసానికీ కళాసాధనకూ ముఖ్యసాధనం భాష. భాషింపబడేది భాష. ఈ భాషకే భాషితం, వాక్కు, వాణి, బాస, ఉక్తి, సరస్వతి అనే పేర్లున్నాయి. మళ్లీ సరస్వతికి, బ్రాహ్మి, భారతి, శుక్ల, ముఖనివాసిని, వర్ణమాతృక సనాతని వంటి అనేక పర్యాయపదాలున్నాయి. భాషను గూర్చి ఆలోచిస్తున్నప్పుడు ఈ మాటలన్నీ సార్థకాలే; సత్యాలే. పలుకబడింది భాషితం; పలుకబడేది వాక్కు; వాణి; భాషకు వికృతి బాస. "అతడు బాస చేశాడు - సమయాన్ని దాటలేదు" - అంటే అతడు ప్రతిజ్ఞ చేశాడు - తన శపథాన్ని అతిక్రమించలేదు అని కూడా అర్థం. అలాగే ఉక్తి అంటే మాట. సూక్తి - (సు+ఉక్తి) అంటే మంచిమాట. సరస్వతి అంటే అంతటా వ్యాప్తి గలది అని అర్థం. మనం చూస్తూనే ఉన్నాం దేశాన్ని కాలాన్నీ జయించి సరస్వతి విశ్వమంతటా ఎలా వ్యాపిస్తున్నదో. బ్రహ్మలోకంలో బ్రహ్మ సరస్సును ఆశ్రయించి నదిరూపంగా ప్రవహించేది అని సరస్వతికి మరో అర్థం కూడా ఉంది. బ్రహ్మసంబంధిని ఐనది బ్రాహ్మి. మన భావాలనన్నింటినీ భరించేది భారతి. ఈ లోకానికి భరతుడు అనే మునిచేత తేబడినదని కూడా అర్థం 'భారతి'కి. "సర్వ శుక్లా సరస్వతీ" - సరస్వతి తెల్లని తల్లి. ఆమె - "కుందేందు తుషార హారధవళ" మొల్లల వలె చంద్రునివలె మంచులా ముత్యాలహారంలా తెల్లనిది. కాబట్టి శుక్ల. ఆ తెల్లదనం ఏదో కాదు - అది సత్త్వగుణం. సత్త్వగుణం తెలుపు; రజోగుణం ఎఱుపు; తమోగుణం నలుపు- అని సాహిత్య శాస్త్రం చెప్పుతున్నది. ముఖంలో (నోట్లో) నాల్కపై ఉండి ప్రసారమవుతుంది భాష కాబట్టి ఆ సరస్వతి ముఖనివాసిని. "ముఖే ముఖే సరస్వతీ" - 'ప్రతినోట సరస్వతి ఉంటుంది.'

భాషలో వర్ణాలు-అక్షరాలు-ఉంటాయి. అందువల్ల వర్ణాలే మాతృకగా గలది. వర్ణమాతృక - భాష. ఇలాంటి భాష ఎప్పుడు పుట్టిందో తెలియదు. చెప్పరానంత ప్రాచీన కాలంలోనే పుట్టింది. కాబట్టి భాష సనాతని. సనాతని అంటే సరస్వతి; లక్ష్మి, పార్వతి అని కూడా అర్థాలున్నాయి. సనాతనం అంటే స్థిరమైన - శాశ్వతమైన అని కూడా అర్థాలున్నాయి. ఇలా ఈ మాటలన్నీ భాష యొక్క లక్షణాలనూ భాష యొక్క గొప్పదనాన్ని చెప్పకే చెప్పుతున్నాయి. భాషా మహిమను బహుముఖాలుగా ప్రకటిస్తున్నాయి.

భాషకు రెండు రూపాలుంటాయి. ఒకటి ధ్వనిరూపం; మరొకటి రేఖారూపం. పలికినప్పుడు అది ధ్వనిరూపం; వ్రాసినప్పుడది రేఖారూపం. రేఖారూపమే లిపి. అదే వ్రాత-లేఖనం-వ్రాయి-అక్షరం. భాష ధ్వనిరూపంగా వీనులవిందుగా వినిపిస్తుంది. అక్షరరూపంగా కన్నుల పండువుగా కనిపిస్తుంది. మరోరకంగా చెప్పితే ధ్వనిరూపం రేడియో ఆడియో-గ్రాంఫోను రికార్డులు. రేఖారూపం-దూరదర్శన్ వీడియోలు సీడీలు. భాష ధ్వనిగా ఆకాశమంతా ఆవరిస్తుంది; రేఖారూపంలో గ్రంథమై దేశదేశాలకు పయనిస్తుంది. శతాబ్దాల తరబడి నిలిచి ఉంటుంది.

భాష వాక్యమయం. వాక్యం పదమయం; పదం అక్షరమయం. అక్షరం అంటే చెడనిది అని అర్థం. అందుకే అక్షరానికున్న మహిమ అసామాన్యం. దానికున్న శక్తి అద్భుతం. దానికున్న అర్థ సంపద బహుముఖీనం. అక్షరం అనే మాటకు అనేకార్థాలున్నాయి. అక్షరం అంటే నీళ్లు. నీళ్ళు అంటే జీవనం. నీళ్లలాగా అక్షరం జీవనాధారం. జీవన వ్యాపారమంతా అక్షరాత్మకమే. అక్షరం అంటే కత్తి అని కూడా అర్థం. ఒక్కొక్కరు పలికే అక్షరాలు, కత్తుల్లా, మనచిత్తాలను కత్తిరిస్తాయి, ప్రాణాలను బలిగొంటాయి. అక్షరం అంటే వర్ణం. మానవ సంఘంలో ఉండే బ్రహ్మ క్షత్రియాది వర్ణాలను (కులాలను) జాతులను తెలుపుతుంది. ఈ వర్ణాలు సమాజ శరీరానికి అవయవాలు. వర్ణం అంటే స్తోత్రమనీ, అరుణ నీలాది వర్ణాలనీ (రంగులనీ) అర్థాలున్నాయి. అక్షరం అంటే యాగం. యాగం త్యాగానికి సంకేతం. త్యాగం లేకుండ యాగం లేదు. త్యాగం అంటే దానం. దానం లేకుండా ఏ యజ్ఞమూ ఉండదు. త్యాగమే అమృతత్వానికి మూలం. అక్షరానికి ఓంకారం అని కూడా అర్థం. ఓంకారం అంటే ప్రణవం. ప్రణవోపాసన అక్షరోపాసనమే. ప్రణవోచ్చారణం భగవంతుని సంకీర్తనం . అక్షరం అంటే పరమాత్మ. అక్షరుడు పరమాత్ముడు. వేదం అక్షర రూపం వేదవేద్యుడు పరమాత్ముడు. అక్షరానికి మోక్షం అని కూడా అర్థం. పోతన మహాకవి అక్షర రూపమైన ఆంధ్ర మహాభాగవతం వ్రాసింది మోక్షప్రాప్తి కోసమే. భాగవతం మోక్షశాస్త్రం. ఆ మహాకవి శ్రీమదాంధ్రభాగవతంలో చెప్పిన - "శ్రీ కైవల్య పదంబుజేరుట కునై చింతించెదన్" "నే పలికిన భవహరమగునట"- "దీనిం దెనింగించి నా జననంబున్ సఫలంబుజేసెద పునర్జన్మంబు లేకుండగన్"- అనే మాటలు మనకు తెలిసినవే. 'తెలుగుల పుణ్యపేటి' అయిన పోతన్న ముక్తిని పొందాడనే మనం భావించాలి, విశ్వసించాలి. ఇలాంటి అసాధారణ శక్తి కలిగిన అక్షరాలు కలిస్తే పదం అవుతుంది. పదం అర్థవంతం. పదం అనగానే పాదం (చరణం) వాక్యం (పలుకుబడి) మాట, పాట - ఇలా అనేకార్థాలు స్ఫురిస్తాయి. ఇక పదసముదాయం వాక్యం. పదమూ పదం యొక్క అర్థమూ, పరస్పర సంబంధం చెడకుండా, ఒకే అర్థం కలిగి ఉన్న పద సముదాయం వాక్యం. వాక్యానికి మాట అని కూడా అర్థం. ఆయన ఒక మంచి వాక్యం చెప్పాడు అంటే మంచి మాట చెప్పాడని భావం.

'వాక్యం రసాత్మకం కావ్యమ్' - 'రసాత్మకమైన వాక్యం కావ్యం'. "వాక్యం రసాత్మకం, కవితకు రూపం వాక్యం; ప్రవృత్తి లాస్యం; ప్రవాహం లయ. ప్రకృతి అభివ్యక్తి, ప్రాణచైతన్యం

అర్థశక్తి. ఆత్మ అనుభూతి" అని అన్నారు డా॥ జి.వి.సుబ్రహ్మణ్యం 'చాటువులు' అనే గ్రంథ పీఠికలో.

కవిత్వం ఎప్పుడు ఎలా అవతరించిందో ఆచార్య సి.నారాయణరెడ్డిగారు కవితాత్మకంగా చెప్పారు ఇలా– "తళుక్కున ఒక మెరుపు దూసికొని పోయినప్పుడు ఒక పుష్కలావర్తకము మదగజము వలె ఘీంకరించినప్పుడు, ఒక మలయ పవన వీచిక అలసగమనముతో వచ్చి మన తనువు నిండ చందనము రాసిపోయినప్పుడు, ఆది మానవుని ఆత్మ పాలకెరటమై పరవళ్లు ద్రొక్కినది. అప్పుడే కవిత్వమునకు నాంది జరిగినది. అట్టి స్వాదు సమయములలోనే తూర్పున వేద ఋక్కులు తొంగిచూచినవి. పడమటింట సామ్స్ (Psalms) పలికినవి" – "ఉద్వేగము నుండియేగాక కరుణలో నుండి సైతము కవిత్వ మన తరించినదనవచ్చును. వాల్మీకిని మనీషిగా మనస్విగా ఎత్తి చూపినది క్రౌంచ మిథున వియోగమే. ఆ మహర్షి మనస్సులో జాలువారిన జాలి నుండియే మహాకావ్యము రూపుదిద్దుకొన్నది" (ఆధునికాంధ్ర కవిత్వము).

'కవయతీతి కవిః' – లోకోత్తరంగా వర్ణించడంలో నైపుణ్యం కలవాడు కవి. వర్ణించడం అంటే భూషించడం, ప్రశంసించడం. కవిచేసే ఆ వర్ణనకు సహృదయ పాఠకుడు స్పందించి ఆనందిస్తాడు. రసభావాలను చక్కగా పరిశీలించేవాడు కవి. కాబట్టి ఆతని వర్ణనం హృద్యంగా ఉంటుంది. కవికి దర్శనం వర్ణనం అనే రెండు శక్తులుంటాయి. దర్శనం అంటే అంశాలలోని తత్త్వాన్ని ఋషిలాగా సాక్షాత్కరింప జేసుకోవడం లేదా దర్శించడం. అలా దర్శించిన తత్త్వాన్ని హృదయం గమంగా రమణీయంగా వ్యక్తీకరించడం వర్ణనం. అందువల్ల కవి మొదట ద్రష్ట అవుతాడు. ఆ తరువాత స్రష్ట (సృజించేవాడు) అవుతాడు. "దర్శనాత్ వర్ణనాచ్చాథ రూఢాలోకే కవిశ్రుతిః" అంటూ భట్ట తౌతుడు అనే ఆలంకారికుడు కవి లక్షణాలను స్పష్టంగా చెప్పాడు. కవి క్రాంతదర్శి. క్రాంతదర్శి అంటే చర్మ చక్షువులకు అతీతాలైన విషయాలను చూడగలిగేవాడు అని భావం. చూచిన తరువాత ఆ విషయాన్ని కవి ప్రతిభాశాలియై వర్ణిస్తాడు. కావ్యాన్ని రచిస్తాడు. ప్రతిభ లేకుంటే కవి కావ్యాన్ని రచించలేడు. ప్రతిభ కవికి సహజసిద్ధం. ఈ ప్రతిభ పదార్థ విస్ఫూర్తిని సమాధి గతమైన కవి మనస్సులో కలిగిస్తుంది. ప్రతిభావంతునికి పరోక్షంలో ఉన్నది కూడా ప్రత్యక్షంగా గోచరిస్తుంది. ప్రతిభ కావ్యహేతువులో ప్రధానమైనది. ప్రతిభను ప్రజ్ఞ, శక్తి, ప్రతిభానం అని కూడా అంటారు. నవ నవ ఉన్మేషశాలిని అయిన – అపూర్వాలైన వస్తువులను నిర్మించడంలో గల నైపుణ్యం ఉన్న – వర్ణింపదగిన వస్తువు పట్ల నిష్ఠ గల – ప్రజ్ఞా విశేషమే ప్రతిభ. కావ్య హేతువులోని అనివార్యమైన అంశాలైన పాండిత్యం, అభ్యాసం – ఈ రెండూ ప్రతిభకు సంస్కారాన్ని ప్రసాదిస్తాయి, మరింత వన్నెను సమకూరుస్తాయి. ప్రతిభ రెండు రకాలు. ఒకటి దేవతా ప్రసాదం చేత లబ్ధమయ్యే ప్రతిభ; రెండవది పాండిత్యం, అభ్యాసం వల్ల కలిగే ప్రతిభ. దైవదత్తమైన ప్రతిభ సుదుర్లభం. కవి ప్రతిభ కవికి పాండితీ లోపం వల్ల కలిగే దోషాన్ని కనిపించకుండ చేస్తుంది. ప్రతిభావంతుడైన కవి నిర్మించే కావ్యం నిత్యనూతనంగా భాసిస్తుంది. కావ్య నిర్మాణంలో కవికి తోడుపడే

రెండవ అంశం నిపుణత. దీనినే వ్యుత్పత్తి, పాండిత్యం అని కూడా అంటారు. ఇది శ్రమైక సాధ్యం. స్థావర జంగమాత్మకమైన ఈ లోకంలోని వ్యక్తులనూ వస్తువులనూ ఆయా ప్రవృత్తులనూ కవి నిశితంగా పరిశీలించడం వల్లనూ, ఛందో వ్యాకరణాది వివిధ శాస్త్రాలనూ కళలను అధ్యయనం చేయడం వల్లనూ పూర్వ మహాకవులు వ్రాసిన ఇతిహాస కావ్యాలను అనుశీలించడం వల్లనూ ఈ నైపుణ్యం సిద్ధిస్తుంది. ఒకరకంగా యుక్తా యుక్త వివేకాన్నీ బహుజ్ఞతనూ వ్యుత్పత్తి అనవచ్చు. ప్రతిభతో పాటు ఈ పాండిత్యం ఉన్న కవిని 'విద్వత్కవి' అని అంటారు. విద్వత్కవే కవి అని ఆలంకారికుల అభిమతం. కవి కావ్యనిర్మాణానికి సాయం చేసే మూడవ అంశం అభ్యాసం. కావ్యవేత్తలైన పెద్దల వద్ద శిక్షను పొంది, దాని ప్రకారం అభ్యాసం చేయడం. ప్రతిభాపాండిత్యాలు రెండున్నా కవికి ఈ అభ్యాసం లేకుంటే కావ్యరచన సాగదు. రచన సాగించినా సరళ మనోహరమైన శైలి అలవడదు. కవితాధార ప్రవహించదు. కవికి సమాధి, లోపలి ప్రయత్నమైతే ఈ అభ్యాసం బాహ్య ప్రయత్నం. సమాధి, అభ్యాసం ఈ రెండూ కవి ప్రతిభను ప్రదీపింప చేస్తాయి. ఇలా ప్రతిభా పాండిత్యాభ్యాసాలు మూడూ సమగ్రంగా కలవారే మహాకవులు. సంస్కృతంలో భాష కాళిదాస భవభూతి వంటి వాళ్ళూ, తెలుగులో నన్నయ తిక్కన శ్రీనాథుడు పెద్దనలాంటి వాళ్ళూ మహాకవులు. అందుకే కవికి అనేక విషయాలు తెలిసి ఉండాలి - అన్నాడు అప్పకవి ఇలా -

> **"శ్రుతి శాస్త్రాంగ పురాణ**
> **ప్రతతియు నితిహాసకావ్య భరతాగమముల్**
> **స్మృతి సంగీత రతి కళా**
> **గతుల నలంకృతుల నెఱుఁగాఁగదగుఁగవికిన్"** (అప్ప కవీయము)

వేమన కూడా అన్నాడు -

> **"రవి కననిది కవి యెఱుగును**
> **కవి యెఱుఁగని చోట రవియుఁగానఁడు"** - అని.

**"రవి గాననిచోఁగవి గాంచునే కదా!"** అన్న ప్రసిద్ధ చాటువు సాహిత్యజ్ఞులకు తెలిసిందే.

తత్త్వవేత్తకు తోచే సత్యం కవికి సౌందర్య రూపంగా భాసిస్తుంది. తత్త్వవేత్తకు కనిపించే చండమార్తాండ తేజస్సు కవికి నిండు చందురుని పండు వెన్నెలగా కనిపిస్తుంది. అయితే కవిలో ఒక తత్త్వవేత్త కూడా ఉంటాడు. కాని ఆతనిలో తత్త్వం సౌందర్యరూపంగా వ్యక్తమవుతుంది. తాత్త్వికదృష్టి లేనివాడు మహాకవి కాజాలడు. కవి సృష్టిలో విశ్వమంతా ప్రతిఫలిస్తుంది.

కవికి ఉత్తమ సంస్కారం గల హృదయముండాలి. అలాంటి హృదయమే సముదాత్తమైన భావనను చేయగలుగుతుంది. అంటే నిర్మల జీవనం సాగించే కవే, లోకానికి ఉపదేశం చేయగలుగుతాడు; మార్గదర్శకమైన సందేశాన్ని అందించగలుగుతాడు. ఆదికవి నన్నయ - శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం ప్రథమాశ్వాసంలో - తన వ్యక్తిత్వాన్ని దృష్టిలో పెట్టుకొని, కవికి ఉండవలసిన గుణాలను నిర్దేశించి చెప్పాడు. కవికి ప్రతిభ, పాండితి,

అభ్యాసంతో పాటు సద్వినుత అవదాత చరితత్వం, నిత్య సత్యవచనత్వం, సుజనత్వం అనే మూడు గుణాలూ ఉండాలని అన్నాడు. సద్వినుత అవదాత చరితత్వం అంటే - పండితుల చేత నుతింపబడిన నిర్మలమైన వర్తనం కలిగి ఉండడం; నిత్య సత్య వచనత్వం అంటే - ఎప్పుడూ సత్యంతో కూడిన వాక్కును కలిగి ఉండడం; ఇంక-సుజనత్వం అంటే మంచితనం కలిగి ఉండడం; ఈ మూడు గుణాలున్న కవి జగద్ధిత కరమైన కావ్యాన్ని రచింపగల్గుతాడని అభిప్రాయపడ్డాడు నన్నయ. అందువల్ల కవికి ప్రతిభా వైదుష్యాదులతో పాటు మల్లికా స్వచ్ఛమైన మనుగడ ఉండాలి. స్వచ్ఛమైన మానవ జీవితానికి ఏకైక మహనీయమైన మార్గం సాహిత్య అధ్యయనం - అని అభిజ్ఞుల అభిప్రాయం.

కవిత్వం ఒక కళ. కళ సౌందర్యద్యోతకం. అందాన్ని కొలిపేది కళ. జీవితాన్ని శోభామయం చేసేది కళ. నేర్పుతో చేసేది కళ. చిత్తరువు మొదలైన పనులలోని నేర్పు కళ. ఫలనిరపేక్షంగా ఆనందం కలిగించేది కళ. మనకున్న 64 కళలలో కవిత్వం సంగీతం చిత్రలేఖనం విగ్రహశిల్పం, నాట్యం అనే ఆనందదాయకాలైన ఐదు కళలను 'లలిత కళలు' (Fine arts) అంటారు. 'క్రియాలాలిత్యము' కలవి కనుక ఇవి లలిత కళలు. నిజానికి లలిత కళలు నాలుగే. నాట్యకళ సమాహారకళ. లలితకళలకు చిత్రకళలు, సరస కళలు అని కూడా పేర్లున్నాయి. ఇంగ్లీషులో 'Art' అనే పదం 'Ars' అనే గ్రీసు శబ్దం నుండి ఉదయించినది. 'Ars' అంటే ప్రకృతి (సహజం) కానిది - అని అర్థం. అందువల్ల 'Art' అంటే 'కృత్రిమం' - అంటే మానవునిచే చేయబడింది అని భావం. కళ సాధారణంగా మానవుని యొక్క ఆంతర ప్రవృత్తిని ప్రదర్శిస్తుంది. భరత మహాముని నాట్యాన్ని 'అవస్థానుకృతి' అన్నాడు.

కవిత్వం ఒక చిత్రకళ. చిత్రణం కలది చిత్రకళ. కవిత్వంలో ఈ చిత్రణం శబ్ద-అర్థ చిత్రణంగా వెలువడుతూ ఉంటుంది. రసానంద జనకాలైనవి సరసకళలు. కవిత్వం ఒక సరసకళ, చరకళ కూడా. చలనం ఉన్న కళ చరకళ. అంటే చరకళలో సౌందర్యానికి మోహనత్వం కలుగుతుంది. కథాత్మక కావ్యాలలోని కథాగమనంలో, పాత్రల శారీరకమైన అవయవాల విక్షేప వర్ణనలో, మానసిక భావ వివర్తన వర్ణనలో చరకళ చోటు చేసుకుంటుంది. చిత్రకళల్లో కవిత్వం ఉత్తమమైనది. కవిత్వం ఆలోచనామృతం. చదివేటప్పుడే కాక కవిత్వం చదివిన తర్వాత కూడా మన మనస్సు దానిని గూర్చి ఆలోచిస్తూ ఆనందిస్తుంటుంది. కళలు శ్రుతిలయ బద్ధమైనవి. ఈ శ్రుతిలయలు మనం కళారూపాలను చూచేటప్పుడు, వినేటప్పుడు మనలో ప్రవేశిస్తాయి. మన చిత్తాలకు ఏకాగ్రతను కలిగిస్తాయి. ఈ ఏకాగ్రమైన చిత్తమే కళాసారస్యాన్ని అనుభవింప గలుగుతుంది. కవిత్వంలో శ్రుతిలయలు ఛందోరూపంలో, వాక్యగతాలైన శబ్దాల విన్యాసరూపంలోనూ అభివ్యక్తమవుతాయి. ఇలాంటి కవితా కళా నిర్మాతను అపరసృష్టి కర్తగా, కావ్య సంసార ప్రజాపతిగా సంభావించారు సాహిత్య శాస్త్రవేత్తలు. ఆ ప్రజాపతి అభిరుచి ప్రకారమే వస్తుస్థితి చిత్రితమవుతుంటుంది; ఈ విశ్వం ప్రవర్తిల్లుతుంది- అని కూడా అన్నారు. ఇలాంటి కవి వాక్కు లోక ధర్మ నియమాలకు లోబడదనీ, స్వతంత్రంగా

ఉంటుందనీ ఆనంద మయమైన కావ్యాన్ని నిర్మిస్తుందనీ అన్నారు ఆలంకారికులు.

కవిత్వం దివ్యమైనది. "If angels are asked to speak, they speak poetry" - దివ్యులు కవిత్వంలోనే మాటాడుతారు' - అని అన్నాడొక ఆంగ్ల సాహిత్యవేత్త.

కవిత్వం స్పృశించని రంగం ఉండదు. కవి భావనావిష్టుడైన తరుణంలో ప్రతి పదార్థంలో ఆనంద తత్త్వాన్ని దర్శించి, దానిని అక్షరరూపంలో మళ్లీ సృజించి సహృదయులచే ఆ ఆనందతత్త్వాన్ని దర్శింపజేస్తాడు. కవి తన దివ్యనేత్రాలలో దర్శించిన అంశంలో లీనమై ఆనందాన్ని పొంది, ఆ ఆనందానుభూతిని పాఠకులకు ప్రసాదిస్తాడు. పాఠకులు పొందే ఈ ఆనందమే రసానందం. మనకు పరిచయమున్న పదార్థాలే అయినా అవి కావ్యంలో ప్రవేశించినప్పుడు రస స్వరూపాన్ని పొంది, ఒక వినూతన శోభతో సౌందర్యంతో ప్రకాశిస్తాయి. అందుకే ఆనందవర్ధనాచార్యులు అన్నారు ఇలా -

**"దృష్ట పూర్వా అపిహ్యర్థాః కావ్యేరస పరిగ్రహాత్**
**సర్వే నవా ఇవా భాన్తి మధుమాస ఇవ ద్రుమాః" (ధ్వన్యాలోకం)**

"కావ్యంలో రసాన్ని స్వీకరించడంవల్ల పూర్వం చూడబడినవే అయినా అన్ని పదార్థాలు కూడ, వసంతర్తువులో వృక్షాలవలె, క్రొత్తవి వలె భాసిస్తాయి" అని ఈ శ్లోకానికి అర్థం. అందుకే కావ్య వస్తువు రమ్యంగా ఉన్నా జుగుప్సాకరంగా ఉన్నా ఉదారంగా ఉన్నా నీచంగా ఉన్నా, విస్తృతంగా ఉన్నా-లేదా, వస్తువే లేకుండా కేవలం భావమే అయినా సరే- భావుకుడైన కవి చక్కగా భావిస్తే అది రసవంతంగా భాసిస్తుంది- అని అన్నాడు ధనంజయుడు అనే ఆలంకారికుడు.

కవిత్వానికి గ్రంథరూపం కావ్యం. సాహిత్యశాస్త్రవేత్తలు కావ్యాన్ని రకరకాలుగా నిర్వచించారు. చిట్ట చివరకు జగన్నాథుడు అనే ఆలంకారికుడు చెప్పిన - "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్" (రసగంగాధరము) "రమణీయమైన అర్థాన్ని ప్రతిపాదించే శబ్దం కావ్యం" అనే నిర్వచనం సరిగా సమగ్రంగా ఉందని ఒప్పుకున్నారు సాహిత్య శాస్త్ర పండితులు. ఇంగ్లీషులో "Poetry is the rhythemic creation of beauty" - కవిత్వం సౌందర్యం యొక్క లయబద్ధమైన సృష్టి" అని ఎడ్గర్ ఎలన్ పో (Edgar Allen Poe) అనే అమెరికా దేశ రచయిత చెప్పిన కవిత్వ నిర్వచనం సమగ్రంగా ఉందని సాహిత్య పరిశోధకుల అభిప్రాయం. కవిత్వానికి ఉండవలసిన ప్రాథమిక గుణాలైన లయాత్మకత, సౌందర్యం (రమణీయార్థం), నూతన సృష్టి ఉన్నాయి ఈ నిర్వచనంలో. మన సంస్కృత లాక్షణికులు కావ్య నిర్వచనం చేస్తే, పాశ్చాత్య విమర్శకులు కవిత్వ నిర్వచనం చేశారు.

కావ్యం సుందరమైన రచన కలిగి ఉండాలి; సార్వజనీనమైన ప్రయోజనం కలిగి ఉండాలి; భావనాత్మకమైన ఆహ్లాదాన్ని అందివ్వాలి. కర్త యొక్క ఆత్మీయతను స్ఫురింపచేయాలి. ఇలాంటి కావ్యాల సమూహన్ని 'సాహిత్యం' అని అంటారు - విమర్శకులు.

వాఙ్మయం, సారస్వతం సాహిత్యం - ఈ మూడు మాటలూ సామాన్య జన వ్యవహారంలో సమానార్థకాలుగా ప్రయోగింపబడుతుంటాయి. కాని సూక్ష్మంగా పరిశీలిస్తే

ఆ మాటల అర్థ విస్తృతిలో కొంత భేదం గోచరిస్తుంది. కొందరు విమర్శకులు వాఙ్మయ సారస్వత శబ్దాలను సమానార్థాకాలుగా భావిస్తారు. సాహిత్యాన్ని, వాఙ్మయంలోనూ సారస్వతంలోనూ ఏకదేశంగా భావిస్తారు. అందుకే ఆంధ్ర వాఙ్మయ చరిత్రను ఆంధ్ర సాహిత్య చరిత్ర అని కూడా అంటారు. వాఙ్మయం. అనే పదంలో చాల విశాలమైన అర్థం ఉంది. వాగ్రూపమైన సర్వం వాఙ్మయం. వాక్+మయం=వాఙ్మయం. దీనిని బట్టి సంభాషణలనూ ఉపన్యాసాలనూ వాఙ్మయంలోని భాగాలుగానే భావించాలి. అయితే వాఙ్మయం అన్నప్పుడు, దానిలోని రచన విజ్ఞానప్రదంగా ఆనందదాయకంగా ఉండాలి అని శాస్త్రకారుల అభిప్రాయం. వాఙ్మయం అనే మాట కన్నా, సారస్వతం అనే మాట కొంత పరిమితమైందే. సరస్వతికి సంబంధించింది సారస్వతం. 'సారస్వతుడు' అంటే సహజ ప్రతిభగల కవి అని రాజశేఖరుడు అనే ఆలంకారికుడు చెప్పాడు. లిఖితమైన లేదా ముద్రితమైన గ్రంథ సముదాయమంతా ఈ సారస్వతంలోకి వస్తుంది. శాస్త్ర గ్రంథాలు ఈ సారస్వతంలోకి వస్తాయి. రాజశేఖరుడు సారస్వతంలో రెండు భాగాలుంటాయన్నాడు. ఒకటి - శాస్త్ర సారస్వతం, రెండు కావ్య సారస్వతం. తర్క వ్యాకరణ మీ మాంసాది శాస్త్రజాలం శాస్త్ర సారస్వతం. ఆత్మీయతా ముద్ర లేనివన్నీ శాస్త్రాలు. ఇవి బుద్ధి వికాసానికీ విజ్ఞాన సంపదకూ తోడ్పడుతాయి. శాస్త్రకర్తలు ద్రష్టలు. ఇక- రామాయణాది కావ్యాలూ అభిజ్ఞాన శాకుంతలాది నాటకాలూ కావ్య సారస్వతం. ఇవి విజ్ఞాన ఆనందాలను అందిస్తాయి. కావ్యకర్తలు స్రష్టలు, ఆత్మీయతా ముద్ర గలిగినవన్నీ కావ్యాలు. ఇక సాహిత్యం అనేది సారస్వతం కన్నా సంకుచితమైనది. సాహిత్యం అనే మాటకు - సాహచర్యం, మైత్రి, సంఘం, సంఘటన, సామగ్రీ సంకలనం అనే అర్థాలు కూడా ఉన్నాయి.

శబ్ద అర్థాల సముచిత సహభావం సాహిత్యం. శబ్దం అర్థం రెండూ పరస్పరానుకూలంగా స్నేహితులలాగా కలసిమెలసి ఉండడం సాహిత్యం. శబ్దార్థాలు రెండూ సమానబలం కలిగి ఉండాలి. ఒక దానికి ఉత్కర్ష మరొక దానికి నికర్ష లేకుండ ఉండాలి. శబ్దార్థాలు రెండూ విచిత్రమైన విన్యాసభంగితో సహృదయ హృదయాలకు ఆహ్లాదాన్ని కలిగిస్తూ ఉండాలి.

హితాన్ని ఉపదేశించేది సాహిత్యం. అనేక శాస్త్రాలలో విషయాలలో సంబంధం ఉండడం వల్ల కావ్యనాటకాది వాఙ్మయానికి సాహిత్యం అనే పేరు వచ్చి ఉంటుందని కూడా విజ్ఞుల అభిప్రాయం. సమస్త విద్యాస్థానాలకు ఏకైక స్థానమైన కావ్యాన్ని పదిహేనవ విద్యాస్థానమన్నాడు రాజశేఖరుడు. నాల్గు వేదాలు, ఆరు వేదంగాలు, నాలుగు శాస్త్రాలు - ఇవన్నీ కలసి పద్నాలుగు విద్యాస్థానాలుగా భావించాడు. అంతేకాదు సాహిత్య విద్యను ఐదవ విద్యగా భావించాడాతడు. ఆన్వీక్షకి (న్యాయశాస్త్రాది విద్య), వేదత్రయం, వార్త (వాణిజ్యం, పశుపాలనం మొదలైనవి), దండనీతి అనేవి నాలుగు విద్యలు అన్నాడు. ఈ నాలుగు విద్యల సారంగా సాహిత్య విద్యను భావించాడు. వాటి సాయంతో ధర్మార్థాలను తెలిసికోవచ్చు లేదా సంపాదించవచ్చు కాబట్టి వాటిని విద్యలుగా పేర్కొన్నాడు - రాజశేఖరుడు.

సాహిత్య శాస్త్రాన్ని ఏడవ వేదాంగం అని కూడా అన్నాడు.

కవిత్వాన్నీ, కావ్య స్వరూప నిర్వచనాలనూ, కావ్యహేతువులనూ కావ్యాత్మ అయిన ధ్వనినీ, కావ్య ప్రయోజనాలనూ, ఛందస్సునూ, కావ్య భేద సర్వస్వాన్నీ, రస విషయక సర్వాన్నీ, గుణ-రీతి-వృత్తి-శయ్యా-పాకాలనూ, అలంకారాలనూ వక్రోక్తి అనుమాన ఔచిత్యాదులనూ - ఇలా కావ్యసంబంధులైన అన్నింటినీ అనుశీలించి వివరించే గ్రంథాలను సాహిత్య సోపానాలుగా సాహిత్య దర్శనంగా సాహిత్య శిల్ప సమీక్షగా సంభావించారు సాహిత్య శాస్త్ర కోవిదులు. సాహిత్య శబ్దాన్ని కావ్యపరంగా ప్రయోగించిన వారిలో కుంతకుడు, రాజశేఖరుడు, రుయ్యకుడు అనే ఆలంకారికులు ముఖ్యులు. రుయ్యకుని సాహిత్య మీ మాంస, అనే గ్రంథం చాలా విస్తృతమైనది. విశ్వనాథుడు రచించిన అలంకార శాస్త్ర గ్రంథం పేరు 'సాహిత్య దర్పణం.'

సాహిత్యానికి ఉన్న ప్రభావం అనంతం. "సాహిత్య సంగీత కలా విహీనః - సాక్షాత్ పశుః పృచ్ఛ విషాణహీనః" - "సాహిత్య సంగీత కళలు తెలియనివాడు తోక కొమ్ములు లేని పశువే" - అనే సూక్తి సాహిత్య ప్రాధాన్యాన్ని బహుధా ప్రకటిస్తున్నది. "సుభాషిత రసస్యాగ్రే సుధా భీతా దివంగతా" - 'సూక్తి రసంతో పోటికి నిలువలేక సుధారసం స్వర్గానికి వెళ్లింది - అనే సుభాషితం సాహిత్య మాధుర్య ప్రభావాన్ని సాహిత్య అమరత్వాన్నీ చాటుతున్నది. "సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్?" - "మంచి కవితా సంపద ఉంటే రాజ్య సంపద ఎందుకు? - అనే భర్తృహరి మాటలు సాహిత్య సంపద ఎంత గొప్పదో చెప్తున్నది. "వాణ్యేకా సమలంకరోతి పురుషం యా సంస్కృతాధార్యాతే" - 'లెస్సగా సంస్కరింపబడిన వాక్కు నరునికి శోభనిస్తుంది'; "సదో భూషా సూక్తిః" - 'సభకు సూక్తియే సొమ్ము' - వంటి మంచి మాటలు సాహితీ మహిమను వేనోళ్ల చాటుతున్నాయి. "సరస్వతీ పవిత్రాణాం జాతిస్తత్ర న దేహినామ్" - 'సరస్వతిచే పవిత్రులైన వాళ్లు ఏజాతికి చెందిన వాళ్లైతే ఏమి?' అనే మంచి మాట సాహిత్య పవిత్రతను శతధా ప్రదర్శిస్తున్నది.

**"అమిత ధనధాన్య భాగ్య భోగములకన్న**

**అమల వాఙ్మయ రామణీయకము ఘనము"** - అని అన్నారు శ్రీ నాళం కృష్ణారావుగారు. "Literature is the thought of thinking souls"అని అన్నాడు కార్లైల్ (Carlyle). ఇలా ఈ సూక్తులన్నీ సాహిత్య మహత్వాన్నీ పటుత్వాన్నీ నొక్కి వక్కాణిస్తున్నాయి.

సాహిత్యమన్నప్పుడు శ్రవ్యకావ్య దృశ్యకావ్య విశేషాలన్నీ ఉంటాయి. కావ్యాలు స్వభావాన్ని బట్టి రెండు విధాలు - శ్రవ్య కావ్యాలు; దృశ్య కావ్యాలు. వినడానికి మాత్రమే యోగ్యమైన కావ్యాలు శ్రవ్యకావ్యాలు, వినడానికే కాక చూడడానికి కూడా తగిన కావ్యాలు దృశ్యకావ్యాలు - అంటే రూపకాలూ ఉపరూపకాలూ. శ్రవ్య కావ్యాల్లో - అష్టాదశ విశిష్ట వర్ణనా యుక్తాలైన మహాకావ్యాలూ ప్రబంధాలూ, శతక - ఉదాహరణ - దండకాది ఉపకావ్యాలూ, మహాభారతాది ఇతిహాసాలూ, భాగవతాది పురాణాలూ, కథా, ఖండకథా, పరికథా-ఉపకథాది గద్య కావ్య విశేషాలూ ఉంటాయి. వీటితో పాటు జానపద గేయ వాఙ్మయమంతా ఇందులోకే

వస్తుంది. ఇక యక్షగానాలూ నాటక ప్రకరణాది ధశవిధరూపకాలూ నాటిక, తోటకం, నాట్యరాసకం లాంటి ముప్పైఆరు ఉపరూపకాలూ ఆంగ్లంలోని దృశ్య కావ్య విశేషాలైన మోదాంత నాటకాలు (Comedy), విషాదాంత నాటకాలు (Tragedy), ప్రహసనాలు (Farce) మూకాభినయ రూపకాలూ (Pantimime) గేయ రూపకాలూ (Melodrama), నృత్య రూపకాలూ (Ballet) సంగీత రూపకాలూ (Operas) ఏకాంకికలూ (One-act play) - ఇవన్నీ దృశ్య కావ్య అంతర్గతమైనవే. అంతేకాదు - గద్యరచనా విశేషాలైన నవలలూ, కథానికలూ జీవితచరిత్రలూ స్వీయచరిత్రలూ (ఆత్మకథలూ) వ్యాసాలూ, సాహిత్య చరిత్రలు, కవుల జీవితాలూ, విమర్శలూ, పరిశోధనలూ - ఇలా అన్నీ సాహిత్య క్షేత్రంలోనివే. ఇంకా- ఇందులో - దళిత సాహిత్యమనీ, స్త్రీ వాద సాహిత్యమనీ, మానవీయ శాస్త్రాల సాహిత్యమనీ, సామాజిక శాస్త్రాల సాహిత్యమనీ చేరుతూనే ఉన్నాయి. సాహిత్య పరిధి పెరుగుతూనే ఉన్నది ఈనాడు.

సాహిత్యాన్ని అధ్యయనం చేయడం. అంటే ఈ సాహితీ ప్రక్రియా విశేషాలన్నిటినీ లేదా ఏదైనా ఒక్క దానిని అనుశీలించడమే. అన్ని ప్రక్రియలను అధ్యయనం చేయడం అసాధ్యం. అందువల్ల ఏ ప్రక్రియ ఇష్టమో ఆ ప్రక్రియను గ్రహించి, వ్యక్తి, అందులో విశేషంగా కృషి చేసి, తమ రచనలతో ఆ ప్రక్రియను మరింత పరిపుష్టం చేయడానికి ప్రయత్నం చేయాలి.

సాహిత్య ప్రక్రియ వల్ల కలిగే ప్రయోజనాలు, సాధారణంగా ఉన్నా, కొన్ని విశేషంగానూ ఉంటాయి. సాహిత్యం ఎందుకు చదువాలి? అని ప్రశ్నించే వాళ్లకు సమాధానం చెప్పాలంటే - ఈ సాహిత్య ప్రక్రియల స్వరూప స్వభావాలనూ, ఆయా ప్రక్రియలలో వచ్చిన ప్రముఖ రచనలనూ లేదా గ్రంథాలను పేర్కొని, వాటివల్ల కలిగే లాభాలను లేదా ప్రయోజనాలను వివరించవలసి ఉంటుంది. అందువల్ల ఒక్కొక్క సాహిత్య ప్రక్రియను గ్రహించి, వాటి ప్రయోజనాలను పరిశీలిద్దాం. ప్రసిద్ధ లాక్షణికుడైన మమ్మటాచార్యుడు కావ్య ప్రయోజనాలను వివరంగా చెప్పాడు ఇలా - "కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యః పరనిర్వృతయే కాంతా సంమితతయోపదేశయుజే" (కావ్య ప్రకాశము)
కావ్యం అంటే సత్కావ్యం అనే భావం. సత్కావ్యం వల్ల కవికి కీర్తి లభిస్తుంది. వాల్మీకి కాళిదాసాదులకూ, నన్నయ తిక్కనాదులకూ లభించినట్లు కావ్యకర్తకు యశస్సు (కీర్తి) లభిస్తుంది. కీర్తి మృత్యువును జయిస్తుంది; అమరత్వాన్ని ఘటింపజేస్తుంది. రససిద్ధులైన కవీశ్వరులకు జరామరణ భయాలు లేవు. కావ్యసృష్టి "అమరతం గూర్చుఁగర్తకు నాశ్రితునకు" అని అన్నాడు దువ్వూరి రామిరెడ్డి కవి. ఇది ఒక లాభం.

రెండవ లాభం - కవికి కావ్యరచన వలన ధనం లభిస్తుంది. దానివల్ల జీవితంలో కష్టాలు తొలగిపోతాయి; సుఖం కలుగుతుంది. 'ధనమూలమిదంజగత్' సూక్తి తెలిసిందే. పూర్వకాలంలో శ్రీహర్షుడు అనే రాజు ధావకుడు అనే కవికి చాలా ధనమిచ్చాడట. తెలుగులో ప్రాచీన మహాకవులైన నన్నయాదులను రాజరాజనరేంద్రాది మహారాజులు ధనమిచ్చి

పోషించారు. అగ్రహారాదులిచ్చి గౌరవించారు. శ్రీకృష్ణ దేవరాయలు అష్టదిగ్గజాలకు సర్వసౌఖ్య సౌకర్యాలు కలిగించిన విషయం అందరికీ తెలిసిందే. మొన్న మొన్నటిదాకా సంస్థానాధిపతులు సత్కవులను పూజించి సన్మానించిన సంఘటనలను చరిత్రలు చాటుతున్నాయి. కవులు కావ్యశ్రీలను అందిస్తే రాజులు కవులను శ్రీమంతులను చేశారు.

కావ్యం వల్ల కలిగే మూడవఫలం - కావ్య పాఠకులకు లోక వ్యవహార జ్ఞానం కలుగడం. కవి కావ్యంలో విభిన్న పాత్రలను సృజించి, వాటి ద్వారా లోకంలోని భిన్న భిన్న వ్యక్తులతో మానవుడు ఎలా ప్రవర్తించాలో తెలుపుతాడు. కావ్యాలలో మహాపురుషుల చరిత్రలను కవి వర్ణిస్తాడు. ఆ వర్ణనలను చదువుతున్నప్పుడు పాఠకులకు లోక వ్యవహారజ్ఞానం కలుగుతుంది. ఆ జ్ఞాన సంస్కారంతో ప్రభావితులై పాఠకులు చిత్త సంస్కారంతో ప్రవర్తించి జీవితాలను సుఖమయం చేసుకునే అవకాశం ఎంతో ఉంది. There are more men ennobled by study than by nature" "పుట్టుకతో కంటె "అధ్యయనం వల్ల ఉదాత్తీకరింపబడ్డవాళ్లే అనేకులు". అని అన్నాడు సిసెరో అనే మహాశయుడు. "Iron sharpens iron; scholar the scholar" అనే ఆంగ్లసూక్తి కూడా ఈ సందర్భంలో పాఠకునికి వర్తిస్తుంది. కావ్యం పాఠకులను సంస్కరిస్తుంది. తన ప్రభావాన్ని వాళ్లపై చూపుతుంది. సాహిత్య అధ్యయనంవల్ల సమలంకృతులైన వాళ్లు సంస్కృత చిత్తులైనవాళ్లు అసంఖ్యాకంగా ఉన్నారు లోకంలో. పాఠకులైన వాళ్లందరికీ ఈ అంశం అనుభవంలోకి వచ్చిందే.

ఇక నాల్గవ కావ్య ప్రయోజనం అనర్థ నివారణం. అంటే - కావ్యం రచించి అమంగళాలను తొలగించుకోవడం. మయూరుడు అనే కవి, తాను కుష్ఠరోగ పీడ నుండి విముక్తుడయ్యాడట. "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" ఆరోగ్యాన్ని సూర్యుని నుండి కోరుకోవాలి" - అనే సూక్తిని ఈ సందర్భానికి చక్కగా అన్వయించుకోవచ్చు. ఆధునిక కాలంలోని మహాకవులూ రచయితలూ ఎందరో తమ తమ ఆరాధ్యదైవతాలనూ, విశేషించి ఆరోగ్య ప్రదాత అయిన సూర్యభగవానుణ్ని, అక్షరాలా సంస్తుతించి, వ్యాధులను దూరం చేసుకున్న ఉదంతాలు అనేకం.

కావ్యంవల్ల కలిగే ఐదవ ప్రయోజనం- రసానందానుభూతి. కావ్యం చదువుతున్నప్పుడు సహృదయులైన పాఠకులు రసాస్వాదనం చేస్తారు. దానివల్ల వెంటనే ఆనందం కలుగుతుంది. దీనిని ఆలంకారికులు 'సద్యఃపరనిర్వృతి' - అని అంటారు. అంటే కావ్యం చదివిన వెంటనే కలిగే గొప్ప ఆనందం అని అర్థం. ఈ ఆనందానుభూతి చేత అన్యవిషయాలన్నీ సహృదయులు మరచిపోతారు.

కావ్యంవలన కలిగే మరో ప్రయోజనం ఉపదేశం; హితోపదేశం. అయితే ఈ ఉపదేశం కవి సంస్కారంపైన ఆతని తాత్త్వికదర్శనంపైన ఆధారపడి ఉంటుంది. ఆ ఉపదేశం సూటిగా వాచ్యంగా ఉండదు. ప్రియురాలు, ప్రియుని మనస్సును నొప్పించకుండా, కమ్మని మాటలతో సుకుమారమైన హావభావాలతో, ఆతణ్ని తన వశం చేసికొని, తాను చెప్పదలచుకున్న విషయాన్ని, చమత్కారంగా ఆనందదాయకంగా ఉండేరీతిగా శ్రీరామునిలాగా ఉండాలి కాని

రావణునిలాగా ఉండకూడదు అని హితబోధ చేస్తూ సన్మార్గంలో ప్రవర్తింప చేస్తున్నట్లుగా కావ్యం ఉపదేశాన్ని అందిస్తుంది.

ఈ కావ్య ప్రయోజనాలలో కొన్ని కవికీ, కొన్ని సహృదయ పాఠకులకూ లభిస్తాయి. సహృదయ పాఠకులంటే - కావ్యాలను పదే పదే పరిశీలించడం వల్ల ఏ పాఠకుల మనస్సులు అనే అద్దాలు నిర్మలాలై కవి వ్యక్తం చేసిన విభావాది రససామగ్రితో తాదాత్మ్యాన్ని చెందడానికి యోగ్యమై ఉంటయో ఆ పాఠకులు సహృదయ పాఠకులు. అంటే - కవి హృదయంతో సమానమైన హృదయాలు కలిగి ఉండి, కవి హృదయంతో సమంగా స్పందించగల్గిన హృదయాలు కల పాఠకులు - సహృదయ పాఠకులు అని భావం. 'సహృదయత' అనే గుణం లేకుంటే పాఠకులకు కవి హృదయం తెలియదు. ఫలితంగా, కవి ఆశించి, అందించే ఆనందాన్ని పొందలేక పోతారు. ఈ ఆనందానుభూతి లేకుంటే వాళ్లు కేవలం పాఠకులే తప్ప సహృదయపాఠకులు మాత్రం కారు.

ఇలా కావ్యంవల్ల కలిగే ఉపయోగాలు ఆరింటిలో ప్రధానంగా మూడు - యశస్సు, ధనం, అనర్థనివారణం అనేవి కవికి చెందుతాయి. ఆనందం, వ్యవహార జ్ఞానం, ఉపదేశం అనే మిగిలిన మూడు, సహృదయ పాఠకులకు చెందుతాయి. సూక్ష్మంగా పరిశీలిస్తే ఆరు ప్రయోజనాలు కూడా సహృదయ పాఠకులకు లభిస్తాయి. 'కావ్యాలను బాగా చదువుకున్న పండితులు' - అనే కీర్తి వస్తుంది. ఆ కీర్తి వల్ల నలుగురు, కావ్య పండితులను పిలిచి, కావ్య సౌందర్య మాధుర్యాలనూ ఎన్నెన్నో విషయాలను వాళ్ల ద్వారా విని, ప్రతిఫలంగా, వాళ్లను, సముచిత ధనాదులతో సత్కరిస్తారు. అందువల్ల వాళ్లకు ధనాదులు సమకూరుతాయి. ఇక - దేవతా సంబంధాలైన, ఆయా కావ్యాంతర్గతాలైన స్తోత్రాదులను భక్తితో నిష్ఠతో పఠించే సహృదయ పాఠకులకు, అమంగళం కూడా తొలగిపోవచ్చు. పాపాలు పటాపంచాలు కావచ్చు. అందుకే అప్పకవి - కావ్యం "అఘంబులడంచు" అనీ, "అఖిలసురలన్ గనcబడcగాc జేయు" అనీ అన్నాడు 'అప్పకవీయం'లో. అల్లసాని పెద్ద నామాత్యుడు - "సప్తసంతానములలో బ్రశస్తిగాంచి - ఖిలము గాకుండునది ధాత్రిcగృతియ" అన్నాడు. "చెడనిది పద్యము సుమ్మీ" అన్నది గువ్వలచెన్నా శతకం. ఈ విధంగా సహృదయ పాఠకులకు కావ్యపఠనం వల్ల ఆరు ప్రయోజనాలూ కలుగుతాయి. కావ్యకర్త అయిన కవి, కొంతకాలం తరువాత, తన కావ్యాలను తానే - కవిగా గాక, సహృదయ పాఠకునిగా చదువుకుంటే, రసానందాన్ని పొందవచ్చు.

ఇలా-ప్రయోజనాలెన్నున్నా, అవి ఏవైనా, కావ్య ప్రయోజనాలలో ఆనంద సందేశాలు ప్రధానమైనవిగా భావించవచ్చు. ఈ రెంటిలోనూ ఆనంద ప్రదానత్వమే ప్రధానం; ఉపదేశం ఆనుషంగికం (అంటే అప్రధానం) - అని లాక్షణికులు అంగీకరించారు. సహృదయ పాఠకునికి ఆనందానుభూతిని కలిగించి, ఆతణ్ని క్రమంగా కర్తవ్యఉన్ముఖుని చేయగల్గడమే కావ్యానికి పరమ ప్రయోజనం. ఆనంద సంధానమే కవిత్వ ధర్మం. ఈ రెండు ప్రయోజనాలు కాలాన్ని బట్టి మారుతుంటాయి.

ఇక - తెలుగు కావ్యాలు మనకు ఆనందాన్నీ సందేశాన్నీ అందించే తీరు తెన్నులను పరిశీలించడానికి కొన్ని ఉదాహరణాలను తీసుకుందాం.

**"నుతజల పూరితంబులగు నూతులు నూటిఁటి కంటె సూనృత**
**వ్రత! యొక బావిమేలు; మఱి బావులు నూటిఁటి కంటె నొక్క స**
**త్క్రతువది మేలు; తత్క్రతుశతంబున కంటె సుతుండుమేలు; త**
**త్సుత శతకంబు కంటె నొక సూనృతవాక్యము మేలు సూడఁగన్"**

(శ్రీమదాంధ్ర మహాభారతం - ఆదిపర్వం 4-94).

ఇది ఆదికవి నన్నయ రచించిన పద్యం. శకుంతలోపాఖ్యానం లోనిది. దుష్యంతుడు శకుంతలను నిరాకరించినప్పుడు ఆతనికి ధర్మప్రబోధం చేస్తూ సత్యవాక్యం యొక్క ప్రాశస్త్యాన్ని వివరిస్తుంది - శకుంతల. "సత్యవ్రతం గల ఓ రాజా! మంచి నీళ్లున్న నూరునూతుల కంటె ఒక బావి మేలు. నూరుబావుల కంటె ఒక మంచి యజ్ఞం మేలు. అలాంటి నూరు యజ్ఞాలకంటె ఒక పుత్రుడు మేలు. అట్టి నూర్గురు పుత్రులకంటె ఒక సత్యవాక్యం మేలు" - అని ఈ పద్యం యొక్క తాత్పర్యం. సత్యమెంత సర్వోత్కృష్టమైందో ప్రపంచించే హృద్యమైన పద్యం ఇది. శకుంతలను గాంధర్వ వివాహం చేసికొని, 'నేను నిన్ను ఎఱుగను' అని నిరాకరించిన దుష్యంతుణ్ని శకుంతల 'సూనృతవ్రత!' అని సంబోధించడం ఒక విధంగా ఎత్తి పొడుపు. అంతేకాదు - ఇప్పటికైనా సత్యవ్రత దీక్షను పూనుమని ఆతణ్ని హెచ్చరిస్తున్నది. ఆమె వెంట వాళ్లిద్దరికి పుట్టిన కొడుకు కూడా ఉన్నాడు. 'సత్య వాక్యం కంటె కొంచెం తక్కువైనా - కొడుకు కూడా నిరాకరింపదగిన వాడు కాడు. మీరు వాణ్ని పరిగ్రహించాలి' - అనే విషయం కూడా ఈ పద్యంలో సూచింపబడినది. సంతానం కంటె సత్యం గొప్పదని చెప్పే ఈ పద్యం నన్నయ మహాకవి పద్యాలలో ఆణిముత్యం. ఈ పద్యం ప్రధానంగా సత్యాన్ని ఉపదేశిస్తున్నా, సత్యాన్ని చెప్పే విధానం వల్ల మనస్సుకు ఆనందం కలుగుతున్నది. సందేశం, ఆనందం రెంటినీ అందించిన పద్యమిది.

**"కనుఁగొని కోపవేగమునఁ గన్నుల నిప్పులురాల, నంగము**
**ల్గనలఁగ సాంద్ర ఘర్మసలిలమ్ములు గ్రమ్మ నితాంతదంత పీ**
**డన రట దాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్తన**
**ర్తన ఘటనా ప్రకార భయద స్ఫురణా పరిణద్ధమూర్తియై"**

(విరాట పర్వం, ద్వితీయ- 133)

ఇది మహాకవి తిక్కనామాత్యుడు రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం విరాట పర్వంలోని పద్యం. కీచకుణ్ని చూచిన భీముని కోపభావాన్ని అభినయ సుందరంగా రూపు కట్టించిన పద్యమిది. విరాటుని కొలువులో, అన్న అయిన ధర్మరాజుతో కూర్చుని ఉన్న భీముడు, ద్రౌపదికి జరిగిన అవమానాన్నీ, కీచకుని పొగరుబోతు తనాన్నీ చూశాడు. "భీముని మనస్సులో కోపం తీవ్రంగా రేగడంవల్ల ఆతని కళ్లనుంచి నిప్పులు రాలాయి. ఒళ్లంతా ఉడికిపోయింది. దట్టంగా చెమట చుక్కలు కమ్ముకున్నాయి. కోపంతో అదే పనిగా పండ్లు

పటపట కొరకడంవల్ల ధ్వనిస్తున్న ముఖం అనే రంగస్థలం మీద వంపులు తిరిగే కనుబొమ్మల కదలికల వల్ల ఏర్పడ్డ నాట్య ప్రదర్శన వైఖరి రూపం తాల్చినట్లుగా ఆకారం ధరించిన వాడైనాడు భీముడు". ఇది ఈ పద్యంలోని భావం. భీముని భయంకర రూపం ఈ పద్యంలో వర్ణితం. ఈ పద్యంలోని అక్షర సంయోజనం, రౌద్రరసానికి అనుకూలంగా ఉంది. ఈ పద్యంలో తకారం, రేఫం, టకారం మళ్లీ మళ్లీ వచ్చాయి. ఫలితంగా రుద్రుని నాట్యలయ నినదించింది. "నితాంతదంత పీడన" - మొదలుకొని - 'మూర్తియై' - వరకున్న దీర్ఘసమాసంలోని అక్షరాల కలయిక, భీముని కోప తీవ్రతను వ్యక్తం చేస్తున్నాయి. వృత్త్యానుప్రాసాలంకారమూ, రూపకాలంకారమూ, ఓజోగుణమూ - ఈ మూడూ కలిసి పద్యాన్ని భీముని భయంకర రూపానికి ప్రతిరూపంగా తీర్చిదిద్దాయి. భీముని కోపాతిశయాన్ని ప్రదర్శించే ఈ పద్యం చదివితే మనకు రసానందం కల్గుతుంది.

**"అంబ!నవాంబు జోజ్జ్వల కరాంబుజ! శారద చంద్ర చంద్రికా**
**డంబర చారుమూర్తి! ప్రకటస్ఫుట భూషణ రత్నరోచిరా**
**చుంబిత దిగ్విభాగ! శ్రుతి సూక్త వివిక్త నిజ ప్రభావ! భా**
**వాంబర వీధి విశ్రుత విహారి! ననుంగృపఁజూడు భారతీ!"**

(ఆంధ్రమహా భారతం - అరణ్య - 4-215)

ఇది - శ్రీమదాంధ్ర మహాభారతం అరణ్య పర్వంలోని పద్యం. కవిత్రయంలో చివరి వాడైన ఎఱ్ఱాప్రెగ్గడ, వ్రాసిన పద్యం ఇది. తార్క్ష్యుడు సరస్వతీ దేవికి నమస్కరించి ఆమెను స్తుతిస్తూ ప్రార్థించిన సందర్భంలోనిది ఈ పద్యం. సరస్వతీదేవి యొక్క స్వరూప స్వభావాలను తెలుపుతున్న పద్యం ఇది. "అమ్మా! సరస్వతీదేవి! కొత్త పద్మాలలాగా ప్రకాశించే చేతులు గలదానా! శరత్కాలంలోని వెన్నెల వెలుగువలె మిలమిలలాడే మనోహరమైన ఆకారం గల దానా! దిగ్దింతాల వరకు కాంతులు వెల్లివిరియ జేసే రత్నభూషలు కలదానా! వేదాలలోని సూక్తులలో చక్కగా వెల్లడించబడిన మహిమ కలదానా! భావాలు అనే ఆకాశ వీధుల్లో ప్రశస్తరీతిలో విహరించేదానా! నన్ను దయతో చూడు!" అని ఈ పద్యం తాత్పర్యం. ఈ పద్య సౌందర్యాన్ని చూచి, పోతన మహాకవి మురిసి, దీనిని స్వీకరించి, తన శ్రీమదాంధ్ర భాగవతం అవతారికలో చేర్చుకున్నాడు. ఈ పద్యంలోని రూపక-అనుప్రాస అలంకారాలు అందచందాలను సమకూర్చాయి పద్యమూర్తికి. చెవినీ మనస్సునూ అలరించే చేవగల పద్యం ఇది. ఈ పద్యాన్ని ప్రతిదినం సరస్వతీ స్తుతి చేసే వేళ, చక్కగా చదువుకోవచ్చు. ఆ సరస్వతీదేవి కృపా కటాక్షానికి పాత్రులం కావచ్చు. ఫలితంగా మనం సాహిత్యవీధుల్లో విహరించవచ్చు - అదీ లాభం! సాహిత్యం చదివితే ఏంలాభం అంటే ఇదే లాభం.

**"దాన కళా కలాప! సముదంచిత సార వివేకసపందన్**
**మానిత యాచమాన జనమానస వృత్త్యభిపూర్తి బుద్ధి, యె**
**వ్వానికి లేదొకింతయును వాఁడొకరుండు భరంబు ధాత్రికిం**
**గానలు గావు, శైలములు గావు, పయోధులు గావు భారముల్"**

(శృంగార నైషధము 3-56)

ఈ పద్యం శ్రీనాథుని శృంగారనైషధం లోనిది. ఇంద్రాదులు నలునితో పల్కిన నీతి వాక్యం. దానగుణ ప్రాధాన్యాన్ని చాటి చెప్పే చక్కని పద్యం ఇది. "దానవిద్య అనే అలంకారం చేత, పూజితమైన శ్రేష్ఠమైన వివేక సంపద చేత పూజ్యమానులైన యాచిస్తున్న జనుల యొక్క మనోగతమైన కోర్కెను తీర్చే సంకల్పం ఎవనికి లేదో, వాడొక్కడే భూమికి బరువు; అరణ్యాలు కొండలు సముద్రాలు బరువుకావు" - అని దీని తాత్పర్యం. సంక్షిప్తంగా చెప్పాలంటే అర్థులకు దానం చెయ్యలేనివాడు భూమికి బరువు చేటు. నిజంగా పుడమితల్లికి అరణ్యాలూ అద్రులూ అంబుధులూ వాని కంటె భారం కావు అని భావం. ఇదొక సుందరమైన సుభాషితం. పరిసంఖ్య అనే అలంకారంచేత శోభిస్తున్నది ఈ పద్యం. ధారాశుద్ధి చేత పద్యం మరింత మధురంగా ఉంది.

**"భూషణములు సెవులకు, బుధ**
**తోషణములనేక జన్మదురితౌఘ విని**
**శ్శోషణములు, మంగళతర**
**ఘోషణములు, గరుడగమను గుణభాషణముల్"**

(శ్రీమదాంధ్ర భాగవతం - దశమస్కంధం)

మహాభక్తకవి, 'తెలుగుల పుణ్యపేటి' అయిన పోతన రచించిన శ్రీమదాంధ్ర భాగవతంలోని 'శ్రీ రుక్మిణీ కల్యాణం' లోనిది. రుక్మిణీ కల్యాణకథ జీవకల్యాణ కథ. అది పరమాత్మకూ జీవాత్మకూ ఉన్న పతిపత్నీ సంబంధాన్ని విశదపరుస్తుంది. కాబట్టి ఆ కథను పూర్తిగా చెప్పుమని పరీక్షిన్మహారాజు శ్రీ శుకమహర్షిని అడుగుతున్న సందర్భంలోనిది.

"గరుడపక్షిపైన సంచరించే శ్రీకృష్ణభగవానుని (శ్రీమహావిష్ణుని) గుణాలను తెలిపే మాటలు చెవులకు ఆభరణాలు. అవి పండితులను సంతోషపరచేవి; అనేక జన్మలవల్ల కలిగిన పాపరాశిని విశేషంగా ఎండగట్టేవి; మిక్కిలి శుభకరమైన ఉచ్చారణధ్వనులు కలవి." అని పై పద్యంలోని భావం. వేద ప్రతిపాద్యుడైన గరుడవాహనుని కల్యాణగుణాలను ప్రకటించే సూక్తులు శ్రవణసుభగాలనీ, తొమ్మిది విధాలుగా ఉన్న భక్తిలో శ్రవణానికే ప్రాథమ్యం అనీ, శబ్దమయమైన జ్ఞాన ద్రవ్యాన్ని పొందేది చెవియే అనీ, భగవద్గుణభాషణం కర్ణభూషణమనీ, పోతన, ఉల్లేఖం అనే అలంకారంతో, చతుష్ప్రాసంతో, అందంగా కందపద్యం చెప్పాడు. పోతన శబ్ద అలంకారాలూ అర్థ అలంకారాలూ తన్మయత్వాన్ని కలిగిస్తాయి.

తాను స్వయంగా కవియై తన రాజధాని అయిన విద్యానగరంలో, 'భువనవిజయము' అనే సాహిత్య సభా భవనాన్ని అలంకరించిన, అల్లసాని పెద్దన, నంది తిమ్మన, మాదయగారి మల్లన మొదలైన అష్టదిగ్గజ కవీంద్రులను పోషించిన శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్త మాల్యద' (విష్ణు చిత్తీయము) అనే ప్రబంధాన్ని వ్రాశాడు. ఆ ప్రబంధంలోని -

**"తెలుఁగ దదేల యన్న? దేశంబు దెలుఁగేను**
**దెలుఁగు వల్లభుండ! దెలుఁగొ కండ**
**యెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి**
**దేశ భాషలందుఁ దెలుఁగు లెస్స"**

"తెలుగులో ప్రబంధం వ్రాయుమనడం ఎందుకు? అనే అనుమానం కలిగితే ఇది తెలుగుదేశం; నేను 'తెలుగువల్లభరాయడు' అనే పేరుగలవాణ్ణి; ఇంక తెలుగుభాష అంటావో అది పులకండం. అన్యభాషలు మాట్లాడే రాజులందరూ నిన్ను సేవించేటప్పుడు, వారితో ఆయా భాషలలో సంభాషించి, దేశభాషలలో తెలుగు ఉత్కృష్టమైనది- అని నీవు ఎఱుగుదువు గదా!" అని ఈ పద్యంలోని భావం. శ్రీకృష్ణదేవరాయలకు కలలో ప్రత్యక్షమైన తెలుగు వల్లభరాయస్వామి అనే పేరుగల భగవంతుడైన శ్రీహరి రాజుతో పలికిన మాటలివి. శ్రీకృష్ణదేవరాయలు భగవంతుని నోట, ఈ మాటలనిపించడం, తెలుగుభాష తెలుగుజాతి చేసుకున్న అదృష్టం. తనకూ వేంకటపతికీ, భేదం లేదని చెప్పిన ఆ స్వామి ఆజ్ఞచే, 'ఆముక్త మాల్యద'ను తన ఇష్టదైవమైన వేంకటాచలపతికి అంకితం చేశాడు శ్రీకృష్ణదేవరాయలు.

**"వరణాద్వీపవతీతటాంచలమునన్ వప్రస్థలీచుంబితాం**
**బరమై, సౌధసుధాప్రభాధవళితప్రాలేయరుఙ్మండలీ**
**హరిణంబై, యరుణాస్పదం బనఁగ నార్యావర్తదేశంబునన్**
**బురమొప్పున్, మహికంఠహారతరళస్ఫూర్తిన్ విడంబింపుచున్"** (మనుచరిత్ర1-1)

ఆంధ్ర కవితా పితామహ బిరుదాంచితుడైన అల్లసాని పెద్దన రచించిన 'మనుచరిత్రము' (స్వారోచిషమనుసంభవము) "పదహారవ శతాబ్దంలో తెలుగు సాహితీ సరస్సులో పూచిన శతపత్రం". అందలి మొదటి పద్యం ఇది - అరుణాస్పదపురవర్ణనం ఇది. "ఆర్యావర్తంలోని వరణా నదీతీరంలో అరుణాస్పదం అనే పట్టణం ఉంది. ఆ పట్టణంలోని ప్రాకారాలు అంబరాన్ని (ఆకాశాన్ని) చుంబిస్తుంటాయి; మేడలకు వేసిన తెల్లని సున్నపుకాంతులు చంద్రునిలోని జింకవంటి నల్లని మచ్చను తెల్లగా చేస్తుంటాయి. ఆ పట్టణం భూదేవి కంఠహారంలోని నాయకమణి (మధ్యమణి) లాగా ప్రకాశిస్తుంటుంది" అని ఈ పద్యంలోని భావం. ఈ పద్యంలో దీర్ఘసమాసాలున్నా పరుషాక్షరాలు లేవు. ద్వీపవతీ, వప్రస్థలీ రుఙ్మండలీ అనే సమతూకం ఉన్న సమస్త పదాలు, ఈ కారాంతాలై, శ్రవణసుఖం కలిగిస్తున్నాయి. 'సౌధసుధా ప్రభాధవళిత' అనే కూర్పులోని 'ధ' వర్ణ ఆవృత్తి 'చుంబితాంబరమై, హరిణంబై, విడంబింపుచున్ అనే పదాలలోని బిందుపూర్వకమైన 'బ' వర్ణం, మాటిమాటికి రావడంవల్ల, ఈ పద్యం, 'సౌకుమార్యం' అనే గుణాన్ని సంతరించుకొని, వీనుల విందునూ, అంతరంగానికి హాయినీ కలిగిస్తున్నాయి. అతిశయోక్తి, ఉత్ప్రేక్ష, ఉపమ-అనే అలంకారాలు మూడూ ఈ పద్యాన్ని ముగ్ధమోహనంగా తీర్చిదిద్దాయి. పెద్దనగారిది చతుర రచన. ఆయన 'చతురవచోనిధి.'

**"అతని నుతింపశక్యమె! జయంతుని తమ్ముడు సోయగంబునన్**
**బతగకులాధిపధ్వజుని ప్రాణసఖుండు కృపారసంబునన్**
**క్షితిధర కన్యకాధిపతికిన్ బ్రతిజోదు సమిజ్జయంబునం**
**దతని కతండె సాటి చతురబ్ధి పరీతమహీతలంబునన్"**

(విజయవిలాసము1-93)

ప్రతిపద్యంలో, చమత్కారాన్ని ప్రదర్శించిన చేమకూర వేంకటకవి రచించిన 'విజయవిలాసము' అనే ప్రబంధంలో కథానాయకుడైన అర్జునుణ్ని వర్ణించే పద్యం ఇది.

"అర్జునుడు, అందంలో జయంతుని తమ్ముడు; దయారసంలో, పక్షీంద్రుడైన గరుత్మంతుణ్ని ధ్వజంగా గలిగిన విష్ణు స్వరూపుడైన శ్రీకృష్ణుని ప్రాణస్నేహితుడు. యుద్ధ విజయంలో, పార్వతీదేవి భర్త అయిన పరమేశ్వరునికి పోటీ నిలిచేటంతటి వీరుడు. నాలుగు సముద్రాలచేత ఆవరింపబడిన ఈ భూలోకంలో ఆతనికాతడే సాటి. అతణ్ని ప్రశంసించడం సాధ్యంకాదు" అని ఈ పద్యతాత్పర్యం. జయంతుడు, శ్రీకృష్ణుడు, పరమేశ్వరుడు క్రమంగా – అందానికీ, దయకూ, శౌర్యానికీ ప్రసిద్ధులు. ఈ ముగ్గురికి క్రమంగా అర్జునుడు నిజంగానే తమ్ముడు, ప్రాణస్నేహితుడు, ప్రతివీరుడు – అని చెప్పడం చమత్కారం. ఈ మూడు ఉపమానాలకు మూడు కథలూ ఉన్నాయి. అది వేరే విషయం. ఈ మూడు గుణాలు ఒక అర్జునునిలో ఉండడం, కథానాయకత్వానికి ప్రబలమైన పోషకాలు; అర్జునుని ఉదాత్తతకు, ఉదాహరణాలు. 'చమత్కారత్వం కావ్యత్వమ్' ఏదో ఒక చమత్కారం ఉంటేనే కవిత్వం. చేమకూర వేంకట కవి కవిత్వలక్షణం చమత్కారం. ఈ పద్యం అందుకు ఒక నిదర్శనం.

ఆధునికాంధ్ర కవితాయుగకర్తలిద్దరిలో గురజాడ అప్పారావు గారొకరు.

**"మంచి చెడ్డలు మనుజులందున**
**ఎంచిచూడగ రెండె కులములు**
**మంచియన్నది మాలయైతే**
**మాలనే అగుదున్"** ('లవణరాజుకల') అన్న ముత్యాలసరం గేయం

గురజాడ సంఘసంస్కరణ దృష్టికి ఉదాహరణం. గురజాడ అస్పృశ్యతా సమస్యకు కావ్యత్వం కల్పించాడు.

**"యెల్లలోకము వొక్కయిల్లై**
**వర్ణభేదము లెల్ల కల్లై**
**వేల నెరుగని ప్రేమబంధము**
**వేడుకలు కురియ"**
**"దేశమనియెడు దొడ్డవృక్షం**
**ప్రేమలను పూలెత్తవలెనోయ్"**
**"అన్నదమ్ములవలెను జాతులు**
**మతములన్నీ మెలగవలెనోయ్"** అనే గేయాల్లో విశ్వమానన ప్రేమకు సువర్ణపతాకం ఎత్తాడు.

**"దేశమంటే మట్టికాదోయ్**
**దేశమంటే మనుషులోయ్"** – అంటూ మనుష్యులను ప్రేమించడమే అచ్చమైన దేశభక్తి అని ప్రకటించాడు. ఇందులోని 'దేశం' అనే మాట అన్ని దేశాలకూ వర్తిస్తుంది.

మరొక ఆధునికాంధ్ర కవితాయుగకర్త రాయప్రోలు సుబ్బారావు గారు.

రాయప్రోలు రచించిన -

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలుపరా నీజాతి నిండుగౌరవము"
"లేదురా యిటువంటి భూదేవి యెందు"
"అవమానమేలరా! అనుమాన మేల
భారతీయుడనంచు భక్తితో పాడ"

- వంటి గేయాలు ఆనాడు ప్రజలలో జాతీయభావాన్ని తరగెత్తించాయి. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అనే సంస్కృత సుభాషితార్థాన్ని, అపూర్వమైన రీతిలో చెప్పారు కవి.

"నాదు జాతి నా దేశము నాదు భాష
అను అహంకార దర్శన మందు మాంధ్ర"

- అనే ప్రబోధాత్మక పంక్తులు ఆనాడు ఆంధ్రరాష్ట్ర ఉద్యమ కవిత్వానికి బీజభూతాలైనవి.

మన తెలుగు భాష, తెలుగుజాతి, తెలుగుదేశం - గర్వించదగ్గ మహాకవి కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు. ఆయన తెలుగులో ప్రథమ జ్ఞానపీఠ పురస్కారగ్రహీత. ఆయన శతాధిక గ్రంథాలు రచించారు. తమ సాహిత్యం చేత సహృదయ క్షేత్రాలను పండించారు. ఆయన తెలుగు భాషను గూర్చి చెప్పిన పద్యం చదివి ఆనందించండి-

"అంతగా నోటితో నందుము వ్రాయుదు
మంతగా నంతందమైన భాష
భాషించువారి యుచ్ఛ్వాసనిశ్వాసముల్
వెలయించి యాయువు పెంచుభాష
పలుమాటలయ్యు సవ్వడి చేత జనముల
శీలమ్ము సవరించు మేలిభాష
చెట్ట యెంతగ పాడుచేయనెంచిన నైన
నావంత మొక్కవోనట్టి భాష
అణువు మొదలు బ్రహ్మాండపర్యంతమొప్పు
బ్రదుకు, బాసయు నంత పర్యంతముండు
అంత వ్యాపించి వెలిగెడు నట్టి భాష
దివ్యమై చావులేనిది తెలుగుభాష."

"తెలుగు భాషయన్న దివ్యభాష" - అని చాటారు విశ్వనాథవారు. మన భాష అందమైందనీ, ఆయువు పెంచేదనీ, ప్రజలశీలాన్ని సవరించేదనీ శాశ్వతమైనదనీ దివ్యమైనదనీ చెప్పిన మాటలు నిత్యసత్యాలు. ఈ మాటలు భాషా విశేషరూపమైన సాహిత్యం యొక్క ప్రయోజనాన్ని నిరూపిస్తున్నాయి.

**"భరతఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై యేడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"**

తెలుగు .సాహిత్యంలో ప్రసిద్ధులైన దేశభక్తకవి శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రచించిన ప్రఖ్యాత పద్యం ఇది. ఈ పద్యం అస్వతంత్ర భారతదేశ దీనస్థితికి అక్షరరూపం. ఆనాటి రాజకీయ పరిస్థితులకు అద్దం ఈ పద్దెం. క్రీ.శ. 1905లో బెంగాలు విభజన అనంతరం బ్రహ్మమత ప్రచారకుడైన బిపిన్ చంద్రపాల్ రాజమహేంద్రవరం వచ్చారు. ఆయన టౌన్‌హాల్‌లో ఐదు రోజులు బ్రిటిష్‌వాళ్ల చర్యలను నిరసిస్తూ ఉపన్యాసాలు చేశారు. చివరిరోజు చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు ఈ పద్యం రచించి చదివారు సభలో. అనేకులు ఆనాడు ఈ పద్యాన్ని మళ్ళీ మళ్ళీ చదివించుకున్నారు. తెలుగు సాహిత్య చరిత్రలో భద్రమైన స్థానం సంపాదించుకున్న పద్యమిది.

**"చెఱసాలల్ పృథుచంద్రశాలలె యగున్ జేదోయి గీలించు న**
**య్యరదండల్ విరిదండ లయ్యెదును హేయంబైన చోడంబలే**
**పరమాన్నంబగు మోట కంబళుల దాల్పన్ పట్టుసెల్లాలగున్**
**స్థిరుడై యే నరు డాత్మదేశమును భక్తింగొల్చునవ్వానికిన్"**
**"భరతఖండంబె యొక పెద్ద బందెఖాన**
**అందులోనున్న ఖయిదీలు హిందుజనులు**
**ఒక్క గదినుండి మార్చి వేరొక్క గదిని**
**బెట్టుటే గాక చెఱయంచు వేరె గలదె?"**

చిలకమర్తివారి ఈ పద్యాలు దేశభక్తిని ప్రబోధిస్తున్నాయి. తన దేశాన్ని సేవించే స్వచ్ఛ స్థిరచిత్తుడైన దేశభక్తుడు చెఱసాలను చంద్రశాలగా, చేతికి వేసిన సంకెళ్లను పూలదండలుగా, జైల్లో వడ్డించే అంబలిని పరమాన్నంగా, మోటకంబళ్లను పట్టు శాల్వలుగా భావిస్తాడు. చివరకు - స్వాతంత్ర్యాన్ని సాధిస్తాడు. ఇది - చిలకమర్తివారు మనకిచ్చిన దేశభక్తి సందేశం. ఆనాడు స్వాతంత్ర్య సమరంలో మొత్తం భారతదేశమే ఒక పెద్ద చెఱసాల అయింది. హిందువులందరూ ఖైదీలే. స్వచ్ఛందంగా దేశంకోసం అసంఖ్యాక ప్రజలు ఎలా జైళ్లకు వెళ్లారో, దేశమాత విముక్తికై ఎంత త్యాగం చేశారో, ఈ పద్యం చాటిచెప్తుతున్నది. లాలా లజపతిరాయ్‌ను మాండలీ జైలుకు పంపించినప్పుడు ఆసేతు హిమాచలంలో, అఖిల భారతంలో, తీవ్ర సంచలనం మొదలైంది. బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిరసిస్తూ జైళ్లకు వెళ్లిన వారెందరో! ఈ పద్యాలు చదివినప్పుడు మనలో దేశభక్తి ఉద్దీప్తమవుతుంది. ఈ పద్యాల రచనోద్దేశం కూడా అదే. సాహిత్యం చదివితే కలిగే లాభం ఇదే.

**"ప్రతి మనిషీ నడిచే దైవం**
**ప్రతి పులుగూ ఎగిరే దైవం**

అడుగడుగున గుడి ఉంది

అందరిలో గుడి ఉంది"

భావకవుల్లో అగ్రేసరుడైన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి గేయమిది.

మనిషిలో దాగి ఉన్న మనీషిని అన్వేషించి మానవత్వాన్ని పూజించాడు ఆ మహాకవి. మనిషిని దైవంగా సంభావించిన విశాల పవిత్ర హృదయుడు ఆయన. కృష్ణశాస్త్రిగారు -

"జయ జయ ప్రియభారత

జనయిత్రీ దివ్యధాత్రి

జయ జయ శతసహస్ర

నరనారీ హృదయనేత్రి" - అని భరతమాతకు సాహిత్య నీరాజనం సమర్పించారు.

"మనసున మల్లెల మాలలూగెనే

కన్నుల వెన్నెల డోల లూగెనే

ఎంత హాయి ఈ రేయి నిండెనో

ఎన్ని నాళ్లకీ బ్రతుకు పండెనో" - ఇది మల్లీశ్వరి సినిమా కోసం దేవులపల్లి వ్రాసిన పాటపల్లవి. సినిమా పాటైనా కలకాలం జ్ఞాపకముంచుకోదగ్గ ఉత్తమగీతం ఇది. అలాగే -

"శ్రీశైలం మల్లన్న శిరసొంచేనా

చేనంతా గంగమ్మా వానా

తిరుమలపై వెంకన్న కనువిప్పేనా

కరుణించు ఎండా వెన్నెలలైనా" - అనే ఈ పాటలో శబ్దం అర్థం రెండూ చక్కగా కలసిపోయాయి. ఈ చరణాలు ఉత్తమ కవిత్వానికి ఉదాహరణలు. అది పద్యమైనా, పాటైనా వచన కవిత అయినా డెందాన్ని రమణీయార్థంతో స్పందింపజేస్తేనే కవిత్వం అవుతుంది.

అభ్యుదయ కవిత్వ ప్రవక్త శ్రీశ్రీ రచించిన 'మహాప్రస్థానం' కావ్యంలోని

"నేను సైతం ప్రపంచాగ్నికి - సమిధ నొక్కటి ఆహుతిచ్చాను

"నేను సైతం - భువన భవనపు - బావుటనై పైకి లేస్తాను" - వంటి పంక్తుల్లోని 'నేను' అనేమాట సామాజిక చైతన్యంలోని ఒక భాగస్వామిగా గుర్తించాలి.

"ఏదేశ చరిత్ర చూచినా - ఏమున్నది గర్వకారణం

నరజాతి చరిత్ర సమస్తం - పరపీడన పరాయణత్వం" - అనే పంక్తులు అభ్యుదయ కవితామార్గమైన గతితార్కిక భౌతిక వాదానికి ఉదాహరణలు.

"ప్రపంచమొక పద్మవ్యూహం - కవిత్వ మొక తీరని దాహం" ఇవి చక్కని విశ్వజనీన సూక్తులు.

"ఊరుకుంటానా నేను

కసిగా కసాయిగా - ఉపద్రవంలాగా ఉవ్వెత్తుగా లేచి

సంహారాన్ని స్యందనం చేసి

ఉద్రేక తరంగాలే తురంగాలుగా

**ఆగ్రహం కొరడాని చేబూని**
**సాయుధ విప్లవ బీభత్స సారథినై**
**భారత కురుక్షేత్రంలో**
**నవయుగ భగవద్గీతా ఝుంఝుని ప్రసరిస్తాను**
**మంటలచేత మాట్లాడించి - రక్తంచేత రాగాలాపన చేయిస్తాను"** (ఝుంఝు)

శ్రీశ్రీ విప్లవకవిగా రచించిన కవిత ఇది. ఇందులో శ్రీశ్రీ శ్రీకృష్ణుడు. ఈ గేయం ఆరని విప్లవ ప్రతిజ్ఞ. బూర్జువాలు కౌరవులు. కార్మికులు పాండవులు. పాండవులే ఇక్కడ మెజారిటి వర్గం; కౌరవులే ఇక్కడ మైనారిటి వర్గం; కౌరవులు పీడకులు. పాండవులు పీడితులు. సాయుధ విప్లవ బీభత్సానికి శ్రీశ్రీ సారథి. ఆతని విప్లవకవితా నినాదం నవయుగ భగవద్గీతాఝుంఝు. ఆతని రథం సంహారం. ఆతని తురంగాలు ఉద్రేకాలు. ఆతనికొరడా ఆగ్రహం. ఈ గేయం విప్లవకవితా మూలసూత్రం. ఇందలి రూపకాలంకారం రమణీయం.

ఆధునికాంధ్ర కవిత్వంలో వచన కవితా పితామహుడు శ్రీ కుందుర్తి ఆంజనేయులు గారు. కవిత్వ ప్రయోజనాలను గూర్చి ఆయన చెప్పిన పంక్తులు పరిశీలింపదగ్గవి.

**"ప్రయోజనం తండ్రిగా**
**పరమసౌందర్యం తల్లిగా**
**పలికే ప్రతివాక్కు రసానందకల్పవల్లిగా**
**నా దారి నాది"**

కవిత్వానికి సామాజిక ప్రయోజనం ముఖ్యమని కుందుర్తి దృక్పథం". ఈ పంక్తుల్లోని 'పరమసౌందర్యం' అనే సమాసం కవిత్వం ఆనందాన్ని అందించాలనే విషయం చెప్తుతున్నది. 'నాదారినాది' అనే పంక్తి, కవియొక్క మౌలికతను సృజనాత్మకతనూ సూచిస్తున్నది.

**"కాని కవిత్వం ఒకటి ఉంది**
**కదలనియ్యదు మెదలనియ్యదు**
**మెత్తగా చేస్తుంది మెదడును**
**జాలిబత్తితో మండిస్తుంది గుండెను"**
**"నిజమైన జనధర్మం పలికేనోరు**
**లోకంలో కవిది ఒక్కటే**
**నిజమైన జనదర్మం పలికేతీరు**
**లోకంలో కవిత ఒక్కటే"** - అనే పంక్తులు పరిశీలింపదగినవి.

మొదటి నాల్గు పంక్తులు కవిత్వం యొక్క ప్రభావాన్ని, రెండవ నాల్గుపంక్తులు కవియొక్క కర్తవ్యాన్నీ, కవిత్వం యొక్క స్వరూపాన్నీ నిర్దేశిస్తున్నాయి. వీటిని గూర్చి ఎంతైనా వ్యాఖ్యానించవచ్చు. అంతగొప్ప ప్రామాణిక పంక్తులివి. కుందుర్తి చెప్పిన పైపంక్తులు సాహిత్యంవల్ల కలిగే లాభాలను అందంగా వ్యక్తం చేస్తున్నాయి.

**"ఓ నిజాము పిశాచమా! కానరాదు**

నిన్ను బోలిన రాజు మా కెన్నడేని
తీగలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణ కోటి రత్నాలవీణ" (అగ్నిధార)

హైదరాబాదు సంస్థానాన్ని పాలించిన నిరంకుశుడైన నిజాంనవాబును, ఆతని దుష్టపాలననూ ధిక్కరించి గర్జించి పల్కిన 'కవిసింహం' డా॥ దాశరథి పల్కులివి. తెలంగాణా స్వాతంత్ర్య మహోద్యమంలో ఈ పద్యం ప్రజల్లో కల్గించిన చైతన్యం మాటల కందనిది. ఆనాడు సభలో మొదట ఇది చదివి, సభను ప్రారంభించేవాళ్లు. ఈ పద్యంవల్ల, ఇందలి సాహిత్యంవల్ల ఏం లాభం అంటే - దానివల్ల జనంలో కల్గిన చైతన్యమే. ఆ చైతన్యమే స్వేచ్ఛాసిద్ధికి దోహదం చేసింది.

"నా జాతిలో చైతన్యం కలిగించడానికి
నా జాతిని జాగృతితో వెలిగించడానికి
వ్రాస్తున్నాను కవిత్వాన్ని
వినిపిస్తున్నాను కవితా ధ్వనిని" అనే పంక్తులు

సాహిత్యంవల్ల సాధించేది ఏమిటో చెప్పుతున్నవి. ఒక చైతన్యం ఒక ప్రబోధం కల్గించడలోనే సాహిత్యం యొక్క సార్థక్యం ఉన్నది.

"ఆరబోని దివ్వెనీవు వెలిగించాలి
వాడబోని తోట నీవు మొలిపించాలి
జాతి కొరకు నీతనువును అర్పించేసి
చావును నీ బ్రతుకునుండి తొలగించాలి" - దాశరథి గారి రుబాయీ ఇది.

ఈ రుబాయీలోని ప్రతిపంక్తి, త్యాగప్రబోధసౌధానికి ఒక స్తంభం లాంటిది. జాతికోసం దేశంకోసం తన ప్రజలకోసం మానవుడు తన ప్రాణాన్ని అర్పించాలనే ఉదాత్త సందేశాన్ని ఇచ్చే ఈ పంక్తులు దేశభక్తి చైతన్య ప్రబోధకాలే. దాశరథి సాహిత్యం చదివితే స్వచ్ఛమైన స్వేచ్ఛాభావం, మానవతాదృక్పథం, శాంతి సమతాది అభ్యుదయ లక్షణాలు స్వాంతాల్లో మొలకెత్తుతాయి.

"కోరుకోవోయ్ మనిషీ! కొబ్బరికాయ జీవితాన్ని
మాదు పగిలినా ఇతరులకు మాధుర్యం పంచాలని
"కోరుకోవోయ్ మనిషీ! కొవ్వొత్తి ఆశయాన్ని
ఒళ్లంతా కాలిపోతున్నా చల్లని వెలుగివ్వాలని"
"కోరుకోవోయ్ మనిషీ! కారుమబ్బు హృదయాన్ని
తాను నీరు నీరవుతున్నా ధరణిని పండించాలని
"కోరుకోవాయ్ మనిషీ కొండవాగు అనురాగాన్ని
తాను చేరింది ఉప్పునీరైనా తాదాత్మ్యం చెందాలని
"కోరుకోవోయ్ మనిషీ! కోటగోడ సహనాన్ని

తన ఒళ్లు చిల్లులు పడుతున్నా తనవారిని బతికించాలని
"కోరుకోవోయ్ మనిషీ! కోడిపుంజు కర్తవ్యాన్ని
గూటిలో తానుపడివున్నా తోటిలోకాన్ని మేల్కొల్పాలని"
"కోరుకోవోయ్ మనిషీ! కోకిల రాగశీలాన్ని
తాను తినేది ఒగరు చిగుళ్లైనా గానసుధలు పంచాలని" (మనిషీ-చిలక)

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, మహాకవి డా॥ సి.నారాయణరెడ్డిగారు వ్రాసిన కవిత ఇది. 'త్యాగమాధురి' ని సప్తస్వరాల వంటి సప్త ఉదాహరణాల ద్వారా ఉపదేశించారు నారాయణరెడ్డిగారు. ఈ కవితలోని కొబ్బరికాయ, కొవ్వొత్తి, కారుమబ్బు, కొండవాగు, కోటగోడ, కోడిపుంజు, కోకిల - అన్నీ ప్రతిదినం మనం చూస్తున్నవే. వీటిద్వారా మనకు త్యాగాన్ని ప్రబోధంచేశారు హృదయంగమంగా - నారాయణరెడ్డి గారు.

" ఏది చూసినా లోతును ఇట్టే పసికట్టాలి
ఏది గీసినా కంటిని ఇట్టే చెరపట్టాలి
ఏదో పరవాలేదని ఎందుకు ఆ గిట్టింపు
ఏది రాసినా గుండెను ఇట్టే గిలకొట్టాలి
ఏది చేసినా లోకం ఇట్టే జైకొట్టాలి" (ప్రపంచపదులు)

ఈ పంక్తుల్లోని నాల్గవ చరణం సాహిత్య లక్షణాన్ని చక్కగా వ్యక్తం చేస్తున్నది. సాహిత్యం ఆనందాన్ని అందించాలన్న ప్రధాన ప్రయోజనాన్ని భంగ్యంతరంగా ప్రకటిస్తున్నది ఈ పంక్తి. ఈ పంక్తి మహాకవి నారాయణరెడ్డిగారి సాహిత్య లక్షణం. వారి సాహిత్యం చదివితే మనకూ ఆ లక్షణం సాధ్యమవుతుంది. లాభమేకదా!

"నేను కవిని - కవిత్వం వ్రాస్తాను
నేను భువిని - అన్నిటినీ నాలోపలే సృష్టిస్తాను
నేను రవిని - ఆర్పరాని అగ్నినై చూస్తాను
నేను రవిచ్ఛవిని - లోకపు కన్నుదమ్ముల వికసింపజేస్తాను
నా తమ్ముల కన్నుల వికసింపజేస్తాను.
నేను సురగవిని - సుధారసాల వర్షిస్తాను
నేను దివిని - నా ప్రపంచాన్నే అక్షరం అమరం చేస్తాను
నేను పవిని - ఉరుముతాను జగాలు విన
మెరుస్తాను జగాలు తమ మార్గాలు కన
నేను హంసను - పరమహంసను
దౌర్జన్యంపై దాడివెడలిన హంసను
నేను మానస సరోవరంలో విహరిస్తాను
అన్ని రసాల్లో మునిగి అంటకుండా ఈవలకి వస్తాను
పాలు నీరు వేరుచేసి చూపిస్తాను

**వాణీ వాణీశుల తలదాల్చి దర్శనమిస్తాను....**

**నా గేయం అహింసా క్రాంతి**

**నా ధ్యేయం విశ్వశాంతి"** (కూలిపోయే కొమ్మ)

ఈ వచన కవితాపంక్తులు వ్రాసింది మహాకవి అభినవ పోతన' బిరుదాంచితులైన శ్రీమాన్ వానమామలై వరదాచార్యులుగారు. కవితా విరాణ్మూర్తిని పరిచయం చేస్తున్నదీ కవిత. కవితకు గ్రంథరూపం కావ్యం. కావ్యసముదాయం సాహిత్యం. అందువల్ల సాహిత్యం ఎంత గొప్పదో చాటుతుందీ కవిత. సాహిత్యం ఎంత గొప్పదైతే దానివల్ల కలిగే లాభం కూడా అంత గొప్పదేగా!

**"నృపుడు రాష్ట్రమునకు నెపుడు కన్ను**

**అంగమేది నొచ్చినను నయనమె యేడ్చు**

**నృపుడు రాష్ట్రమునకు నెపుడు నోరు**

**అంగమెది సుఖించినను నాస్యమ్మె నవ్వు"** ('వైశాలిని')

ఈపద్యంలోని 'నృపుడు' అంటే నరపాలకుడు - రాజు అని అర్థం. ఈనాడు దానిని ప్రజానాయకునికి సంకేతంగా భావించాలి. వరదాచార్యులుగారి ఈ పద్యం నిజమైన ప్రజానాయకుని లక్షణాన్ని చాటుతూ వర్తమాన ప్రజానాయకులకు సందేశమిస్తున్నది - ప్రజల కష్టసుఖాలను తమవిగా భావించాలని.

ఇక దృశ్యకావ్య విశేషాలవల్ల కలిగే లాభాలను (ప్రయోజనాలను) పరిశీలిద్దాం. అందరూ చూడదగిన కళ నాట్యకళ - లేదా రూపకకళ. రూపకాలను చదువుకోవచ్చు కూడా. నాట్యకళ లలితమైనది; సార్వజనీనమైనది; అందుకే నాట్యకళ సాంఘికకళ. కవిత్వం, సంగీతం, చిత్రలేఖనం, విగ్రహశిల్పం, వాస్తుశిల్పం వంటి కళలన్నీ నాట్యకళలో ఉంటాయి. కాబట్టి నాట్యాన్ని (రూపకాన్ని) సమాహార కళ (Comprehensive Art) అనీ, సహకార కళ (Co-operative Art) అనీ అన్నారు. అందుకే కాళిదాసమహాకవి **"నాట్యం-భిన్నరుచేర్జనస్య బహుధాప్యేకం సమారాధనమ్"** విభిన్న అభిరుచులున్న ప్రజలను సంతృప్తిపరుస్తుంది నాట్యం - అని అభివర్ణించారు.

అధర్మ మార్గంలో సంచరించే ప్రజలను స్వధర్మ నిరతులను చేయడానికి నాట్యకళ సృష్టింపబడింది. ఇది ఉపదేశం చేయడమే కాక ప్రజలకు విశ్రాంతినీ, వినోదాన్నీ కలిగించి వారికి సుఖం కలిగిస్తుంది. సుఖాంతరూపకమేకాదు విషాదాంత రూపకాన్ని దర్శించినా కలిగే ఫలం ఆనందమే.

తెలుగులో నాట్యకళకు 147 సంవత్సరాల చరిత్ర ఉన్నది. పౌరాణిక, చారిత్రక - సాంఘిక నాటకాలు అనేకం వచ్చాయి. విజయం సాధించాయి. వీటిలో ఏరూపకాన్నైనా చదువండి; లేదా ప్రదర్శిస్తే చూడండి. వాటివల్ల కలిగే లాభాలను మీరే అనుభవిస్తారు.

ఇక నవల అనే సాహిత్య ప్రక్రియా ప్రయోజనాన్ని గూర్చి ఆలోచిద్దాం. పాశ్చాత్య భాషా ప్రభావం వల్ల వృద్ధి పొందిన ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియ 'నవల'. ఈ ప్రక్రియ

బహుజనాదరణ పొందింది. 'నవల'ను ఇంగ్లీషులో 'Novel' అంటారు. వ్యుత్పత్తినిబట్టి 'నవ్యకథ' అని అర్థమని విజ్ఞులు చెప్పారు. తెలుగులో 'నవల' అనే పదాన్ని మొదట ప్రయోగించినవారు విమర్శకాగ్రేసరులు శ్రీ కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి గారు. వీరేశలింగం పంతులుగారు రచించిన 'రాజశేఖర చరిత్ర'ను సమీక్షించే సందర్భంలో వారు ఈ పదాన్ని వాడారు.

నవల స్వయంసంపూర్ణమైన సాహిత్య ప్రక్రియ. రసానందాన్ని కల్గించే సాధన సామగ్రి అంతా నవలలోనే నిక్షిప్తమై ఉంటుంది. నవల మానవజీవితాన్ని గురించి వ్యాఖ్యానిస్తుంది. మనచుట్టూ ఉన్న ప్రపంచంతో పరిచయం చేస్తుంది. నవల పరిధి చాలా విస్తృతమైనది. కేవలం కథ చెప్పడమే కాక ఆచార వ్యవహారాలను తెలుపుతుంది. జీవితంపైన ఒక దృక్పథాన్ని ఏర్పరుస్తుంది. నవలలో మత-రాజకీయ-సాంఘిక సమస్యలన్నీ చర్చింపబడుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే నవలలో చెప్పరాని విషయం ఉండదు. నవలల్లో సాంఘిక, చారిత్రక, పౌరాణిక రాజకీయ హాస్య నవలలున్నాయి. నవలలు చదివితే రకరకాల విషయాలు తెలుస్తాయి. కందుకూరివారి 'రాజశేఖర చరిత్ర' చదివితే ఆనాటి సాంఘికదురాచారాలన్నీ మనకు అర్థమవుతాయి. స్త్రీ జనదుఃస్థితి, నిర్బంధవైధవ్యం, బాల్యవివాహాలు, వరశుల్క విధానం, విద్యావిహీనత్వం, మూఢవిశ్వాసాలు తెలుస్తాయి. అలాగే చిలకమర్తివారి 'రామచంద్రవిజయము' నవల చదివితే ఆనాటి కోనసీమ కళ్లముందు మెదలుతుంది. వేంకట పార్వతీశ్వరకవుల 'మాతృమందిరము' చదివితే - మద్యపాన నిషేధ ప్రయత్నాలు, హరిజన దేవాలయ ప్రవేశం మున్నగునవి తెలుసుకోవచ్చు. విశ్వనాథవారి 'వేయి పడగలు' చదివితే ధనవంతుల దౌష్ట్యాలూ, నిరుపేదల బాధలూ, చాతుర్వర్ణ్య వ్యవస్థ, దేశోద్ధరణ ఆశయాలు అన్నీ అర్థమవుతాయి. భారతీయ నాగరికతా సంప్రదాయాలు తెలుస్తాయి. విశ్వనాథవారి "పరీక్ష" చదివితే నేటి విద్యావిధానంలోని లోపాలు తెలుస్తాయి. చలం నవలలు చదివితే స్త్రీల తిరుగుబాటు మనస్తత్వం బోధపడుతుంది. ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి'ని అధ్యయనం చేస్తే ఆనాటి సహాయనిరాకరణోద్యమం, ఆదర్శప్రణయం, హరిజనుల కుటుంబ వ్యవహారాలు తెలిసివస్తాయి. అడివిబాపిరాజు నవల 'నారాయణరావు'ను చూస్తే మహోజ్జ్వనామృతభాండం దొరికినట్లనిపిస్తుంది. సురవరం ప్రతాపరెడ్డి నవల 'శుద్ధాంతకాంత'ను తిలకిస్తే నిజాం కాలంనాటి సాంఘిక సాంస్కృతిక రాజకీయాది విషయాలు అవగాహనకు వస్తాయి. నోరి నరసింహశాస్త్రిగారి 'రుద్రమదేవి', కాకతీయుల కాలంనాటి పరిస్థితులను వివరిస్తే, చిలకమర్తి వారి 'గణపతి' హాస్యరసాన్ని పోసి ఆరోగ్యాన్ని కూరుస్తుంది. ఇంకా మొక్కపాటి వారి "బారిష్టరు పార్వతీశం", మునిమాణిక్యంగారి 'దీక్షితులు' అనే నవలలు చదివితే హాస్యరసం అర్థమవుతుంది. వుప్పల లక్ష్మణరావుగారి 'అతడు-ఆమె', వట్టికోట ఆళ్వారుస్వామి గారి "ప్రజలమనిషి" నవలలు చదివితే రాజకీయ పరిజ్ఞానం కలుగుతుంది. ఇంకా శ్రీమతి మాలతీచందూరు గారి 'చంపకము-చదపురుగులూ', శ్రీమతి లతగారి 'మోహన వంశి', ముప్పాళ రంగనాయకమ్మ గారి 'బలిపీఠం', శ్రీదేవిగారి 'కాలాతీత

వ్యక్తులు' మున్నగు నవలలు చదువండి. మన సంఘంలోని ఎగుడు దిగుళ్లు అర్థమవుతాయి. ఆనందం కలిగించే నవలలు, సందేశమిచ్చే నవలలూ రెండూ చదువండి. నవలాసాహిత్యం ఎంతగొప్పదో, దానివల్ల కలిగే వికాసం ఎలాంటిదో తెలుస్తుంది.

ఇక కథా, కథానికా సాహిత్య ప్రక్రియవల్ల కలిగే లాభాలను గూర్చి తెలుసుకుందాం. ఈ సందర్భంలో మహాకవి డా॥ సి. నారాయణరెడ్డిగారి మాటలు పేర్కొనదగినవి **"కవిత స్వప్నసుందరి, కథ సహధర్మచారిణి, కవిత అతిదూరాన తళుక్కున మెరిసే అప్సరాంగన. కథ చేరువగా ఉన్న చిర పరిచితురాలి వంటిది. ప్రతివాని జీవితానికి సన్నిహితమైనది కథ".**

**"ఏకాంశవ్యగ్రమై స్వయం సమగ్రమైన కథాత్మక వచన ప్రక్రియ కథానిక"** అని డా॥ పోరంకి దక్షిణామూర్తిగారు కథానికను నిర్వచించారు. స్వల్ప వ్యవధిలో శ్రోతలను రంజింపచేయడం కథయొక్క ప్రాథమికధర్మం. కథలు ఆధునిక సమాజాన్ని, అందలి వివిధ సూక్ష్మాంశాలనూ చూపిస్తాయి. తెలుగులో అనేకంగా వెలువడ్డాయి కథానికలు. చలం కథలు చదివితే స్త్రీ పురుష సంబంధాలు, స్వేచ్ఛావాదాలు తెలుస్తాయి. కొడవటిగంటి కుటుంబరావు కథలు మధ్య తరగతి మానవుల జీవితాలను మనకు పరిచయం చేస్తాయి. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు మధ్యతరగతి వాళ్ల ముద్దు ముచ్చట్లూ, మూఢ విశ్వాసాలూ తెలియజేయగా, గోపిచంద్ కథలు రాజకీయ సామాజిక స్పృహను మనలో పాదు కొల్పుతాయి. మధురాంతకం రాజారాంగారి కొన్ని కథలు స్నేహమాధురిని చవిచూపిస్తే ముళ్లపూడి వారికథలు చమత్కారాన్ని అనుభవింపజేస్తాయి. రాచకొండవారి కథలు సమాజంలోని వర్గవ్యత్యాసాలను ప్రకటిస్తే, మునిమాణిక్యం, ముప్పాళ రంగనాయకమ్మ కథలు దాంపత్య జీవనంలోని కన్నిటినీ పన్నీటినీ మనపై చిలకరిస్తాయి. గురజాడ 'దిద్దుబాటు', శ్రీ శ్రీ "అశ్వమేధం", మల్లాదివారి 'తాతగారు', కాళీపట్నం వారి 'సీతారావుఁడు', రావూరి భరద్వాజగారి 'డాక్టర్స్ డైలమా', మంజుశ్రీ గారి "దబ్బు జబ్బు", శ్రీమతి పరిమళా సోమేశ్వర్‌గారి 'క్రోటన్ మొక్కలు'- వంటి కథానికలు రచనా శిల్ప మనోహరాలై ఆనందోపదేశాలతో పాటు మన అభ్యుదయ భావోద్యమనానికి దోహదం చేస్తాయి. గొప్ప కథలుగా పేరొందిన చలంగారి 'ఓ పువ్వు పూసింది', పద్మరాజుగారి 'గాలివాన', "పడవ ప్రయాణం", బుచ్చిబాబుగారి "పొగలేని నిప్పు", విశ్వనాథశాస్త్రి గారి 'కార్నర్‌సీట్', 'నీడలు' - చదువండి- ఒక వేళ చదువకపోతే ఇప్పటి దాకా. కథ గొప్పతనం అనుభవింప గలుగుతారు. కథా సాహిత్యం వల్ల కలిగే లాభాలను చెప్పేటప్పుడు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి ఈ మంచి మాటలు పేర్కొనడం ఎంతో అవసరం - **"కథలు కళ్లకు వెలిగిస్తాయి. బుద్ధికి పదును పెడతాయి. మనస్సుకి ఉత్సాహమూ ఉల్లాసమూ కలిగిస్తాయి. జడునకున్నూ కల్పనా శక్తి ప్రతిపాదిస్తాయి. నిజంగా వొక్కొక్క కథ యెలాంటి ఘట్టంలోనూ కూడా వొక్కొక్కళ్లని వొడ్డెక్కిస్తుంది. కథలు చదువడమూ అథమం వినడమూ యెప్పుడూ దండుగ అనుకోకేం?"**

ఇక - 'స్వీయ చరిత్ర' సాహిత్యాన్ని తీసుకుందాం. సాహిత్య ప్రక్రియలలో

ఆకర్షణీయమైన ప్రక్రియ 'స్వీయచరిత్ర'. 'స్వీయ చరిత్ర' అంటే వ్యక్తి స్వయంగా తన జీవితగాథను చెప్పడం. మానవ జీవిత సంబంధాలను ఈ స్వీయచరిత్రలు ఆవిష్కరిస్తాయి. ఈ ప్రక్రియలో ఉండే ప్రత్యక్ష కథనం చేత సహృదయ పాఠకులపై విశేష ప్రభావం ప్రసరిస్తుంది. ఉత్తమ సంస్కారం స్వీయచరిత్ర పఠనం వల్ల అబ్బుతుంది. వ్యక్తి వైశిష్ట్యాన్ని బట్టి భవిష్యత్తులో సమాజానికి స్వీయచరిత్ర పాఠం మార్గదర్శకంగా పనిచేస్తుంది. స్వీయచరిత్రలు సామాజిక చరిత్ర నిర్మాణానికి ప్రాథమిక ఆధారాలుగా నిలుస్తాయి. వీటిని చదివితే పాఠకునికి జీవితం పట్ల ఒక బాధ్యతాయుతమైన దృక్కోణం ఏర్పడుతుంది. స్థూలంగా స్వీయచరిత్రలు ప్రపంచదేశాల సామాజిక దృక్పథాలను ప్రభావితం చేస్తాయి. రూసో, టాల్‌స్టాయ్‌ల రచనలు గాంధీజీని ఎంతో ప్రభావితం చేశాయి. ఉప్పల లక్ష్మణరావుగారి 'బతుకు-పుస్తకం' స్వీయచరిత్ర వల్ల కందుకూరి వీరేశలింగం పంతులు అనంతరం ఆంధ్రదేశంలో వచ్చిన భావపరివర్తనం, స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోని వామపక్ష ఉద్యమ స్వరూపం, ఆకాలంలోని వైదేశిక వ్యవస్థ మొదలైనవి తెలుస్తున్నాయి. కొందరి స్వీయచరిత్రలు స్వీయచరిత్రలను వ్రాసుకోనివాళ్ల జీవితాలలోని సంభ్రమ ఆశ్చర్యకరమైన సంఘటనలనూ, సంగతులనూ ఆవిష్కరిస్తాయి. ఉదాహరణకు - మోక్షగుండం విశ్వేశ్వరయ్యను గూర్చి ఎన్నో విషయాలను తెలుపుతుంది 'ప్రఫుల్ల చంద్రరే' గారి స్వీయచరిత్ర. ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్ర విశారదుడైన శ్రీనివాస రామానుజం గూర్చి విశేష వివరాలను తెలుపుతుంది చింతామణి ద్వారకనాథ్ దేశ్‌ముఖ్ గారి స్వీయచరిత్ర. అట్లాగే అసాధారణ మేధాసంపన్నుడైన రెంటాల వేంకట సుబ్బారావుగారిని గూర్చి వల్లూరి సూర్యనారాయణరావుగారు తమ స్వీయచరిత్రలో వెల్లడించిన విషయాలు ఎన్నెన్నో! అలాగే ఆయుర్వేద వైద్యంలో అఖిలభారత ప్రశస్తిని ఆర్జించిన దివి గోపాలాచార్యుల వారిని గూర్చి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తమ- 'అనుభవాలు-జ్ఞాపకాలు' లో విశేషంగా వివరించారు. ఏనుగుల వీరాస్వామి 'కాశీయాత్రా చరిత్ర'ను చదివితే - క్రీ.శ.1840 ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవాలయం నుంచి ఈస్టిండియా కంపెనీకి సంవత్సరానికి లక్షరూపాయల లాభం వచ్చేదనీ, కాశీపట్టణంలో ఉన్నంత జనసంఖ్య ప్రపంచంలోని మహానగరాలైన లండన్, పారిస్‌లలో తప్ప మరెక్కడా లేదనీ తెలుస్తుంది. కందుకూరి స్వీయచరిత్ర చదివితే ఆనాటి అజ్ఞానమూ మోసాలే కాక, 4 రూపాయలతో ఒక పెద్ద కుటుంబం సుఖంగా జీవించగల్గి ఉండేదనీ, చెన్నపట్నం వెళ్లాలంటే కాకినాడ వెళ్లి 'పొగ ఓడ' ఎక్కవలసిందే అని తెలుస్తుంది. వల్లూరి సూర్యనారాయణరావు స్వీయచరిత్రవల్ల మహామేధావి రెంటాల వేంకట సుబ్బారావు, ఒక్క స్కాట్లండ్‌లో తప్ప ప్రపంచంలో ఎక్కడా లేనంత పెద్ద ఫోటో స్టూడియో స్థాపించారనీ, ఆయన సిద్ధం చేసిన భారతీయ ఛాయాచిత్రాలు ఆనాటి ప్రపంచ దేశాల మార్కెట్‌ను ఆకర్షించాయనీ తెలిపి ఆశ్చర్యానందాల్లో మునిగిపోతాం. తమ ఇంట్లో వివాహం జరిగే ముందుగా ఒక హరిజనునికి వివాహం జరుపటం సంప్రదాయమని శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు తమ స్వీయచరిత్ర (శ్రీకృష్ణ స్వీయచరిత్ర)లో చెప్పారు. టంగుటూరి ప్రకాశం పంతులుగారి స్వీయచరిత్ర ద్వారా

మనపై ఇంగ్లీషు ప్రభావమూ, ఆనాటి నాటక సమాజాల పరిస్థితులూ, ఏలూరులో రత్నకంబళాలు నేయటం వంటి ఎన్నో విషయాలు తెలుస్తాయి. దర్శి చెంచయ్యగారి స్వీయచరిత్ర ద్వారా ఖుదీరాంబోసు దేశభక్తిని గూర్చిన అనేక విషయాలు తెలుస్తాయి. అయ్యదేవర కాళేశ్వరరావు గారి 'జీవిత కథ' వల్ల ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి సంబంధించిన అనేకాంశాలనూ, రావి నారాయణరెడ్డి స్వీయచరిత్ర ద్వారా వీర తెలంగాణాలోని ఆంధ్ర మహాసభల తీరు తెన్నులూ, సాయుధమైన తిరుగుబాటు సంగతులూ తెలుస్తాయి. క్రీ.శ.1897 వరకు సర్కారులూ గోదావరి జిల్లాల వాళ్లూ రైలును ఎరుగరని చిలకమర్తి స్వీయచరిత్ర చెప్పుతున్నది. చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారి 'కాశీయాత్ర' వల్ల, కాశీలో చదువుకునే విద్యార్థులు సమాపనోత్సవం (Convocation) నాడు భంగు సేవించేవారని తెలుస్తున్నది. దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారి స్వీయచరిత్ర వల్ల, వారి సత్య వినయాలూ, దేశసేవాత్యాగాలూ తెలుస్తాయి. ఇలా పాఠకులను పులకింపచేసే అనేక సంఘటనలనూ, ఉదంతాలనూ, స్వీయచరిత్రలు తెలిపి, మన విజ్ఞాన పరిధిని మరింత విశాలం చేసి మన వ్యక్తిత్వాన్ని సమగ్రంగా తీర్చిదిద్దుకునే వాతావరణాన్ని సృష్టిస్తాయి. ఇంతకంటె లాభం ఏం కావాలి. అందుకే సాహిత్యం చదువాలి.

ఇక జీవిత చరిత్రలు పరాశ్రయ వస్తుకాలు. ఉపదేశ ప్రధానాలు. సత్యకథనం ఇందులో ముఖ్యం. జీవితచరిత్రలోని నాయకునికి అధికారం ఐశ్వర్యం లేకున్నా సచ్ఛీలం, పరోపకారం, త్యాగం వంటి సద్గుణాలు ఉండడం అవసరం. ఇలాంటి సత్పురుషుల జీవితచరిత్రలే మార్గదర్శకాలు సమాజానికి.

తెలుగులో జీవితచరిత్ర రచనకు మార్గదర్శకులు శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు. కందుకూరి రచించిన "జీసస్", చిలకమర్తి రచించిన "గౌతమబుద్ధుడు", గొట్టిపాటి వెంకట సుబ్బయ్యగారి "సర్దార్ పటేల్", "కట్టమంచి రామలింగారెడ్డి", ఏడిద కామేశ్వరరావు గారి "ఆచార్య కృపలానీ", శ్రీ చిరంతనానంద స్వామి వారి "వివేకానంద", "శ్రీ రామకృష్ణ పరమహంస", వడ్లమూడి వెంకటరత్నంగారి "దయానంద జీవిత చరిత్ర", వేదం వేంకటరాయశాస్త్రి (మనుమడు) గారి "మహామహోపాధ్యాయ వేదం వేంకటరాయశాస్త్రి" (తాత), ముదిగంటి జగన్నాథశాస్త్రి సంతరించిన "వినాయక సావర్కారు", "నెహ్రూ జీవిత చరిత్ర" , కొత్తపల్లి వీరభద్రరావుగారి "సి.పి.బ్రౌను", నిడుదవోలు వేంకటరావుగారి చిన్నయసూరి, కందుకూరి ఆంధ్రకవుల చరిత్ర, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారి "వేమన", వేటూరి ప్రభాకరశాస్త్రిగారి "శృంగార శ్రీనాథము" చిలుకూరి వీరభద్రరావు గారి "తిక్కన సోమయాజి" మొదలైన జీవితచరిత్రలు చదివితే మనకు ఆ మహనీయుల సత్కార్యాలూ, వారి విశాల హృదయాలూ, వారి మానవతా దృక్పథాలూ, ఆత్మజ్ఞాన సిద్ధులూ, వారి జీవిత విధానాలూ, వారి త్రికరణ శుద్ధి తెలుస్తాయి. వారి భావాలు మనకు ఆదర్శప్రాయాలవుతాయి. మన మనః పీఠికలపైన అవి చెరగని ముద్ర వేస్తాయి. మనస్సులు సంస్కరింపబడ్డప్పుడు జీవితాలు పవిత్రంగా నిర్దుష్టంగా నిర్మలంగా కొన

సాగుతాయి. "మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః" "మానవుల బంధ మోక్షాలకు మనస్సే కారణం" అన్న శ్రీకృష్ణ పరమాత్ముని గీతోపదేశం మనకు తెలిసిన విషయమే. మనస్సు సత్యంతో శుద్ధి పొందుతుంది కదా! - "మనః సత్యేన శుద్ధ్యతి". జీవితచరిత్రలు సంస్కార వాసనా విలసితాలు; తెలుగు వాఙ్మయానికి అలంకారాలు; మనందరికీ మార్గదర్శకాలు.

జీవితచరిత్రలు చదివినప్పుడు భాషా సంపద కూడా సమకూరుతుంది. భాషా సంపదతో పాటు సత్యసంస్కారాలూ, ఉదార జీవిత విధానమూ ఉంటే, మనమూ స్వీయచరిత్రలు, జీవిత చరిత్రలు వ్రాసి మంచి రచయితలుగా పేరు సంపాదించుకోవచ్చు. మంచి మానవులుగా కీర్తి ధనమూ ఆర్జించవచ్చు. ఇంతకంటె ఏం లాభం కావాలి?

ఇక వ్యాస సాహిత్యాన్ని పరిశీలిద్దాం. వ్యాసం అంటే ఒక అంశాన్ని గూర్చి విస్తరించి వ్రాయడం. వ్యాసాన్ని మొదట్లో ప్రమేయం, సంగ్రహం, వచనకావ్యం, ఉపన్యాసం అనే పేర్లతో పిలిచారు. వ్యాసాన్ని ఇంగ్లీషులో 'ఎస్సే' (Essay) అని అంటారు. 'వ్యాసం' అన్నమాట క్రీ.శ.1900 నుంచి వినిపిస్తున్నది. వ్యాస ప్రక్రియ ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల మన తెలుగు సాహిత్యంలో వెలిసింది. తన సంతృప్తి కోసంగానీ, ఇతరులను సంతృప్తి పరచడంకోసం గానీ కళాత్మకంగా వ్రాసిన రచన 'వ్యాసం' అనీ, విషయ నిర్ణయయోగ్యతనూ, మానసిక సామర్థ్యాన్నీ తనంతట తాను స్వేచ్ఛగా పరీక్షించుకోవడమే 'వ్యాసం' అనీ అభిజ్ఞులు అన్నారు.

సాధారణంగా లోకంలో రచయితలు తెలియనివాళ్లకోసం విషయం తెలుపాలనీ, నాటక కర్తలైతే విభిన్నమైన పాత్రలను పరిచయం చేయాలనీ, తాము పొందిన కావ్యానందానుభూతిని వివరించాలనీ, ఇంకా సంఘాన్ని సంస్కరించాలనీ గ్రంథాన్ని విమర్శించాలనీ, చరిత్రను నిర్మించాలనీ - ఇలా రకరకాల ఉద్దేశాలతో వ్యాసాలను వ్రాస్తుంటారు. మేధావులూ, హృదయ వాదులూ వ్యాసాలను సృజిస్తారు. వ్యాసం ఆలోచనా ప్రధానంగా గానీ అనుభూతి ప్రధానంగా గానీ ఉండవచ్చు. వ్యాసం విషయంలో పరిమితి లేదు. ఏ విషయాన్నైనా వ్యాసంలో చెప్పవచ్చు. ఇంత విస్తృతి మరో సాహిత్య ప్రక్రియకు లేదు.

వ్యాసం ఆనందం కలిగిస్తుంది; జ్ఞానాధిక్యానికి తోడ్పడుతుంది. వ్యాసం సాహిత్యంలోని గుణదోషాలను చెప్తుతుంది; వినూత్నభావాలను వెదజల్లుతుంది. సంఘసంస్కరణ దృష్టిని కలిగిస్తుంది.

తెలుగు సాహిత్యంలో వ్యాస ప్రక్రియకు ఆద్యులు కందుకూరి వీరేశలింగం పంతులుగారే అని విమర్శకుల అభిప్రాయం. స్త్రీ విద్య, సంఘసంస్కరణం, పునర్జన్మ, బాల్యవివాహం ప్రార్థన మున్నగు అంశాలను గూర్చి కందుకూరి వ్రాసిన వ్యాసాలు విజ్ఞాన వికాసాలతోపాటు మృదు మధుర సరళశైలినీ మనకు ప్రసాదిస్తున్నాయి. ఈ వ్యాస ప్రక్రియను కందుకూరి తర్వాత గురజాడ, పానుగంటి, చిలుకూరి నారాయణరావు, కట్టమంచి, చలం మొదలైన వాళ్లు ఎంతో అభివృద్ధి చేశారు; వ్యాసపరిధిని విశాలం చేశారు.

పానుగంటి లక్ష్మీనరసింహారావు గారి సాక్షివ్యాసాలు – ఇప్పటికీ మన హృదయాలల్లో విజ్ఞాన ఆనంద తరంగాలను, నవ్వులనురుగులనూ నింపుతాయి. వాటిని చదివితే మనకు ధారాళమైన భాషాశైలులబ్బుతాయి. అప్పట్లో "ఆంధ్రపత్రిక" "కృష్ణాపత్రిక" వ్యాసాలు సాహిత్యానికి పుష్టినీ, పాఠకులకు తుష్టినీ కలిగించాయి. కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారి చారిత్రక, కళా, సారస్వత విజ్ఞాన సర్వస్వ వ్యాసాలూ, మల్లంపల్లి సోమశేఖరశర్మగారి చరిత్ర పరిశోధనాత్మక వ్యాసాలూ, కోరాడ రామకృష్ణయ్యగారి సారస్వత వ్యాసాలూ, వావిలాల సోమయాజులగారి 'మణి ప్రవాళము' అనే పేరుతో వచ్చిన వ్యాసాలూ ఉత్తమస్థాయికి చెందిన వ్యాసాలు. ఆనాడు కందుకూరి సంస్కరణ దృక్పథంచే ప్రభావితలైన స్త్రీలు ఎంతోమంది వ్యాసాలు వ్రాశారు. సంస్కార సంపన్నుడైన, మార్గదర్శకుడైన ఒక వ్యాసకర్త వ్రాసిన వ్యాసాల వల్ల మహిళలు కూడా వ్యాస రచయిత్రులుగా మారడం అనేది లాభమే కదా! అందువల్ల వ్యాసం జ్ఞానాన్నీ, ఆనందాన్నీ అందిస్తూ రచయితలనూ రచయిత్రులనూ సిద్ధం చేస్తున్నది. ఇది లాభమే!

ఇక – విమర్శ –పరిశోధన సాహిత్య ప్రక్రియా ప్రయోజనాలను గూర్చి తెలుసుకుందాం. తెలుగులో సాహిత్య విమర్శనం ఆధునిక యుగంలో అవతరించిన సాహిత్య ప్రక్రియ. విమర్శ అంటే – ఏదైనా గ్రంథాన్నిగానీ, కళారూపాన్ని గానీ బాగుగా పరిశీలించి, దానిలోని బాగోగులను ప్రదర్శించడం, వస్తువులను గుణదోషాలను యథాస్థితంగా వెల్లడిచేయడం; ఇంకా సంక్షిప్తంగా చెప్పాలంటే – సదసద్వివేచనం; వస్తు తత్త్వ నిరూపణం. అంతేకాని విమర్శనం అంటే కేవలం దోషాన్ని ఎత్తి చూపడం కాదు; గుణాన్ని ఖండించడం కాదు. అనుశీలనం, సమాలోచనం, వివేచనం, సమీక్షణం, పరిశీలనం, పర్యాలోకనం – అనేవి విమర్శకు పర్యాయపదాలు. సాహిత్య విమర్శనం ఒక కళ; ఒక శాస్త్రం – రెండూ.

విమర్శ గ్రంథాలు, వ్యాసాలు, గ్రంథ సమీక్షలు, పీఠికలు, వ్యాఖ్యానాలు, సాహిత్య చరిత్రలు, సిద్ధాంత వ్యాసాలు (పరిశోధనలు) –ఇవన్నీ ఈనాటి విమర్శ సాహిత్య స్వరూపాలు. అంటే ఇవన్నీ తెలుగు సాహిత్య విమర్శలో విభాగాలే.

ఉత్తమ విమర్శలు చదివినందువల్ల పఠితలకు విజ్ఞానవికాసాలు, వినూతన చైతన్యం, సారస్వత పరమార్థం, అవగాహనశక్తి, వినూత్న దృక్కోణం, సందేహ నివృత్తి, సన్మార్గ సందర్శనం రసానుభూతి, కీర్తి ప్రతిష్ఠలూ, భాషాభివృద్ధి ఇవన్నీ సిద్ధిస్తాయి. విమర్శ ప్రయోజనం గూర్చి కందుకూరి వారి మాటలు ఈ సందర్భంలో ఉదాహరణీయాలు – **"పండిన వృక్షమునకే రాతి దెబ్బలన్నట్లు పుస్తకములు వ్రాయువారికే విమర్శనములను రాళ్లు తాకును. అయిననవి మొదల కొంత నొప్పి కలిగించి, గ్రంథకర్తను కాలక్రమమున గట్టివానిం గావించుటయే కాక యాతని మహోన్నతునింజేసి విమర్శనముల గుఱికందని వానిగా జేయును".**

విమర్శలలో ఎన్నో భేదాలున్నాయి, వాటి వాటి లాభాలున్నాయి. లక్షణ విమర్శలు కవులకు మార్గదర్శకాలు; సూత్ర విమర్శలు ప్రక్రియానుగుణమైన సాపేక్ష సిద్ధాంతాలను పరిచయం చేస్తాయి. ఆలంకారిక విమర్శలవల్ల లక్షణ గ్రంథాల ప్రమాణాలు తెలుస్తాయి.

స్వతంత్ర విమర్శలు చదివితే మౌలికమైన కావ్య వివేచనలు తెలుస్తాయి. కవి జీవిత విమర్శల వల్ల కావ్యరచనకూ కవిజీవితానికి ఉన్న సంబంధాలు, కవి వ్యక్తిత్వం కావ్యంలో ప్రతిఫలించిన తీరుతెన్నులు అర్థమవుతాయి. తులనాత్మక విమర్శలు చదివితే ఏక కాలంలో ఉన్న కవులలో, వాళ్లు స్వీకరించే ప్రక్రియలలో, వాళ్లు గ్రహించిన వస్తువులో ఉండే తారతమ్యాలు అవగాహనకు వస్తాయి. పరిష్కార విమర్శనలను అధ్యయనం చేస్తే శబ్ద ప్రయోగ ఔచిత్యంతో పాటు శుద్ధప్రతులను రూపొందించే విధానాలు తెలుస్తాయి. మొత్తం మీద ఏరకమైన విమర్శ సాహిత్యం చదివినా పాఠకులు తమ జ్ఞానసామ్రాజ్య వైశాల్యాన్ని మరింత విపులతరం చేసుకోవడానికి వీలు కలుగుతుంది.

తెలుగులో సాహిత్య విమర్శకు కూడా ఆద్యులు కందుకూరి వారే. వారి ఆంధ్ర కవుల చరిత్ర ఇందుకు ఉదాహరణం. పాశ్చాత్యదృష్టితో విమర్శసాగించినవాళ్లల్లో కట్టమంచి రామలింగారెడ్డి గారు ప్రథములు. వారి 'కవిత్వతత్త్వ విచారము' ఇందుకు నిదర్శనం. కవి కోకిల దువ్వూరి రామిరెడ్డిగారు ప్రాచ్య పాశ్చాత్య లాక్షణికుల విమర్శ విధానాలు రెంటినీ సమ్మేళనం చేసి విమర్శ వ్యాసాలు వ్రాశారు. రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారి "వేమన", "సారస్వతా లోకము" పుట్టపర్తి నారాయణాచార్యులవారి "ప్రబంధ నాయికలు", రామకృష్ణుని గూర్చిన విమర్శలు, విశ్వనాథ గారి 'నన్నయ ప్రసన్న కథా కలితార్థయుక్తి', 'అల్లసాని వాని అల్లిక జిగి బిగి' – ఆంధ్ర సారస్వత పరిషతువారి 'ఆంధ్ర మహాభారత – ఆంధ్ర మహాభాగవత ఉపన్యాస సంపుటాలు', పల్లా దుర్గయ్యగారి 'చతురవచోనిధి', తాపీ ధర్మారావుగారి 'విజయవిలాస హృదయోల్లాస' వ్యాఖ్యాన గ్రంథం, బండారు తమ్మయ్యగారి 'పాల్కురికి సోమనాథ కవి' మున్నగు విమర్శ గ్రంథాలు ఎన్నదగినవి. ఇంకా – వివిధ విశ్వవిద్యాలయాలలో వివిధ సాహిత్య ప్రక్రియలపై ప్రసిద్ధ కవులపై, వారి ధోరణులపై, సాహిత్య సిద్ధాంతాలపై అనేక పరిశోధనలు జరిగాయి. డా॥ వెలుదండ నిత్యానందరావుగారు వెలువరించిన సిద్ధాంత గ్రంథాల విషయానుగుణ సూచిక ప్రకారం క్రీ.శ.1998 నాటికి 2960 తెలుగు సాహిత్య పరిశోధనలు జరిగాయి. అనేక నూత్న విషయాలు ప్రతిపాదింపబడ్డాయి. డా॥దివాకర్ల వేంకటావధానిగారి 'నన్నయ భారతము', డా॥ కేతవరపు రామకోటి శాస్త్రి గారి 'తిక్కన కావ్యశిల్పము', డా॥అమరేశం రాజేశ్వరశర్మగారి 'నన్నెచోడని కవిత్వము', డా॥జంధ్యాల జయకృష్ణ బాపూజీ గారి 'శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము', డా॥ కె.శ్రీరామ్మూర్తి గారి 'ఈశ్వరార్చన కళాశీలుడు', డా॥ప్రసాదరాయ కులపతి గారి 'ఆంధ్ర భాగవత విమర్శ', డా॥ధూళపాళ శ్రీరామమూర్తి గారి 'పోతన భాగవతానుశీలన', డా॥వేటూరి ఆనందమూర్తిగారి 'విజయనగర యుగపు తెలుగు సాహిత్యంపై వైష్ణవ తత్త్వ ప్రభావం', (సంపుటాలు) డా॥కె.వి.ఆర్ నరసింహగారి 'ఆంధ్ర ప్రబంధం – అవతరణ వికాసములు', డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావు గారి – 'ఆముక్త మాల్యదా సౌందర్యము', డా॥సి.నారాయణరెడ్డి గారి 'ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు – ప్రయోగములు', ఆచార్య బి.రామరాజు గారి 'తెనుగు జానపద గేయ సాహిత్యము' వంటి ప్రముఖ పరిశోధన గ్రంథాలు – ప్రాచీన

– ఆధునికాంధ్ర సాహిత్యమరందాలనూ జానపద గేయ సౌరభాలనూ మనకు ప్రసాదిస్తున్నాయి. సాహిత్య విద్యార్థులు ఈ గ్రంథాలను పరిశీలిస్తే ఆ మహాకవుల కవిత్వ వ్యక్తిత్వ మహత్త్వాలు తెలుస్తాయి. కీ.శే. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారి నవ్యాలోకం, అభినవలోచనం, ఆంధ్రసాహిత్యంపై ఆంగ్ల ప్రభావం మున్నగు విమర్శ గ్రంథాలూ, వారు, సంపాదకులుగా, తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురిత శ్రీమదాంధ్ర మహాభారత సంపుటాలకు విరచించిన సుదీర్ఘ విస్తృత పీఠికలూ తెలుగు సాహిత్య విమర్శను ఎంతో పరిపుష్టం చేశాయి. 'తెలుగు సాహిత్య విమర్శ అవతరణ వికాసాలు' – అనే పరిశోధన గ్రంథాన్ని రచించిన డా॥ ఎస్.వి.రామారావుగారు, 'ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ – సాంప్రదాయక రీతి' అనే సిద్ధాంత గ్రంథాన్ని వ్రాసిన డా॥ కోవెల సంపత్కుమారాచార్యులుగారు, తెలుగు సాహిత్య విమర్శకు సంబంధించిన అనేకాంశాలను వివరించి, సాహిత్య విమర్శను చదివే సహృదయ పాఠకులకు ఎంతో లాభం చేకూర్చారు. ఈ పరిశోధన గ్రంథాలన్నీ చదివితే మన తెలుగు సాహిత్య సౌందర్య మాధుర్య గాంభీర్య వైశాల్య ఔన్నత్యాలు మనకు అర్థమవుతాయి. మన హృదయాలూ మరింత సుందరంగా మధురంగా గంభీరంగా విశాలంగా ఉన్నతంగా వెలుగుతాయి. ఇంతకంటె లాభం ఏం కావాలి? చదివిన వాళ్లు విద్వాంసులై విశేష యశో విరాజితులై శ్రీమంతులై సుఖమనుభవిస్తారు. ఇంతకంటె లాభం ఏం కావాలి? సాహిత్యం చదివితే అన్నీ లాభాలే. మనం చేసే తపస్సు వల్ల మనకు తేజస్సు కల్గుతుంది. సాహిత్యం చదువడం అంటే ఒక తపస్సే. "తపః స్థితానాం సులభం హి సర్వమ్" – 'తపస్సులో ఉన్నవాళ్లకు అన్నీ సులభమే' – "తపో మూల మిదం సర్వం దైవమానుషకం సుఖమ్" – 'లోకంలో మానవులకు కలిగే దైవసుఖమైనా మానుష సుఖమైనా అతడు చేసుకున్న తపస్సు వల్లనే కలుగుతుంది" –

**"చదువని వాఁ డజ్ఞుండగుఁ**
**జదివిన సద సద్వివేక చతురత గలుగుం**
**జదువఁగ వలయును జనులకు"**

(పోతన భాగవతము – సప్తమ స్కంధం –130)

# ఉపయుక్త గ్రంథ సూచిక


| | | |
|---|---|---|
| రఘువంశము | - | కాళిదాసు |
| కావ్యాదర్శము | - | దండి |
| రమ్యాలోకము | - | రాయప్రోలు |
| సాహిత్య సురభి | - | విశ్వనాథ |
| శ్రీశ్రీ కవితావైభవం | - | డా॥ మిరియాల రామకృష్ణ |
| మనిషీ-చిలక | - | డా॥ సి. నారాయణరెడ్డి |
| చాటువులు | - | డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి |
| ఆధునికాంధ్ర కవిత్వము | - | డా॥ సి. నారాయణరెడ్డి |
| సాహిత్య శిల్ప సమీక్ష | - | పింగళి లక్ష్మీకాంతం |
| దశరూపకం | - | ధనంజయుడు |
| సాహిత్య సోపానములు | - | డా॥ దివాకర్ల వేంకటావధాని |
| సాహిత్య దర్శనము | - | డా॥ కె.వి.ఆర్. నరసింహం |
| అలంకార శాస్త్ర చరిత్ర | - | డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు |
| మమ్మటుని కావ్య ప్రకాశము | - | డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడుగారి బాలానందిని వ్యాఖ్య |
| తెలుగునాటక వికాసము | - | డా॥ పి.ఎస్.ఆర్. అప్పారావు |
| తెలుగులో స్వీయచరిత్రలు | - | డా॥ అక్కిరాజు రమాపతిరావు (మంజుశ్రీ) |
| తెలుగు కథానిక-స్వరూప స్వభావములు | - | డా॥ పోరంకి దక్షిణామూర్తి |
| తెలుగు పరిశోధన | - | డా॥ వెలుదండ నిత్యానందరావు |
| తెలుగు వ్యాస పరిణామం | - | డా॥ కొలకలూరి ఇనాక్ |
| పూర్వకవుల కావ్యదృక్పథాలు | - | డా॥ కోవెల సంపత్కుమారాచార్యులు |
| సాహిత్య పదకోశం | - | తెలుగు అకాడమీ ప్రచురణ |
| తెలుగు సాహిత్య విమర్శ - అవతరణ వికాసాలు | - | డా॥ ఎస్.వి. రామారావు |
| కావ్యమీమాంస | - | రాజశేఖరుడు |
| అప్పకవీయము | - | అప్పకవి |
| సంస్కృత సూక్తి రత్నాకరము | - | సంపాదకులు డా॥ రవ్వా శ్రీహరి |
| దాశరథి కృతులు | - | దాశరథి |
| తెలుగు తల్లి | - | ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ సంపాదకులు డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం |

Blank Page

Blank Page



# డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

**జననం :** 01-01-1938

**జన్మస్థలం :** నారాయణపురం, కరీంనగర్ జిల్లా, ఆం.ప్ర.

**తల్లిదండ్రులు :** కీ.శే. శ్రీమతి వేంకటమ్మ -
కీ.శే. శ్రీమాన్ మనోహరాచార్యులు

**వృత్తి :** 1959 నుంచి 1995 వరకు ఆంధ్ర భాషా సాహిత్యాధ్యాపనం

**రచనలు :** ఉదయరాగము (ఖండకావ్యం - 1970), జీవనస్వరాలు (ఖండ కావ్యం, సంయుక్త రచన - 1971), కిరణాలు- కెరటాలు (కవితాత్మక సూక్తులు - 1977) నారాయణరెడ్డి సాహితీమూర్తి (విమర్శగ్రంథం - 1981), తెలుగులో గేయనాటికలు (సిద్ధాంత గ్రంథం - 1988), తెలుగు రుబాయీలు (ముక్తకమంజరి, ఉర్దూ రుబాయీ ప్రక్రియ - 1988), గంగా తరంగాలు (లలితగీతికా సంకలనం - 1992), దీపాల చూపులు (ముక్తకాలు, రూబాయీ ప్రక్రియ - 1993), రవ్వల పతాక (ముక్తకాలు, రుబాయీ ప్రక్రియ- 1999), కావ్య పుష్కరిణి (పద్యకవితా సంపుటి - 2001), వ్యాసోల్లాసం (సాహిత్య వ్యాస సంపుటి - 2002), ప్రపంచ విపంచి (పంచ పదుల సంకలనం - 2004), భాస్కర శతక వ్యాఖ్యానం - 2004, రుబాయీ గులాబీలు (రుబాయీ ప్రక్రియ 2005)

**పురస్కారాలు :** 1. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు (1982), 2. వానమామలై వరదాచార్య స్మారక సాహితీ పురస్కారం (1989), 3. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాల ఉత్తమ ఉపన్యాసక పురస్కారం (1992), 4. 'కలహంసి' బాబయ్య స్మారక పురస్కారం, 5. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ కవితా పురస్కారం (1996), 6. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం వారి మహాకవి దాశరథి స్మారక పురస్కారం (1997), 7. అరుంధతి కళాసంస్థ వారి మహాకవి దాశరథి స్మారక పురస్కృతి (1998), 8. 'రసమయి' పురస్కారం (2000), 9. రాయప్రోలు 'వంశీరత్న' స్వర్ణపతక పురస్కారం (2002). 10. శ్రీ బి. లక్ష్మీకాంతరావు స్మారక పురస్కారం (2002). 11. కీ॥శే॥ శ్రీమతి నాదెళ్ళ లక్ష్మమ్మ స్మారక పురస్కారం (2004), 12. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సర్వజిత్తు ఉగాది పురస్కారం (2007), 13. డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి స్మారక పురస్కారం (2007).